# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 35 సంచిక 8

పేజీలు 40

ఏప్రిల్ 2016

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**


భద్రవాక్యం .......................................2

శ్రీబాబూజీ ఉవాచ................................3

అమ్మమాట...........................................................6

యోగిని శ్రీ చంద్ర కాళీప్రసాద మాతాజీవారి కార్యక్రమాలు .....................9

సకలపీడా పరిహారకుడు సద్గురుదేవుడు......10

స్వామి రామతీర్థ ................................11

హనుమాన్‌చాలీసా .............................13

యోగవాశిష్ఠము ...............................15

మహామనీషి కొండ వెంకటరాజుగారు.........17

గుండుగొలనుశాఖ ఆవిష్కరణ ...............19

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు...................21

పరిప్రశ్న ........................................22

వార్తలు .........................................24

బృందావనమది అందరిదీ ...................27

శ్రీకృష్ణకర్ణామృతము...........................28

శ్రీవిజయేశ్వరానందప్రసాద్‌గారికినివాళి......29

గీతాధ్యయనమ్ ................................31

అగస్త్యమహర్షి ................................33

కారు చీకటిలో కాంతి రేఖ...................... 35

సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర...........37

విష్ణు కథలు- సూరదాస్ .....................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

సమ్భూతించ వినాశం చ యస్తద్వేదోభయగ్ం సహ ।
వినాశేన మృత్యుం తీర్త్వా సమ్భూత్యామృత మశ్నుతే ॥
( ఈశావాశ్యోపనిషత్ -14 శ్లో॥)

మానవుడు తన జీవనోపాధికి తగినంత ధనాన్ని ఆర్జించ వలసినదే. తప్పు లేదు. వసతికి గృహాన్ని ఏర్పరచుకోవటం తన కర్తవ్యం. అయితే ఐహిక సంపదల, కీర్తిప్రతిష్ఠల వ్యామోహంలో పడి సాధకుడు తన జీవిత పరమార్థమేమిటో మరచి ప్రవర్తిస్తే తనకి సంప్రాప్తించిన మానవజన్మ సాఫల్యం కాకపోగా వట్టిచేతులతో మట్టిపాలు కాక తప్పదు కదా!

పోనీ తాను ఆర్జించిన సంపదగానీ, కీర్తిప్రతిష్ఠలుగానీ పదవులు గానీ తనను మృత్యువు నుండి తప్పించగలుగుతాయా? అసంభవం! మరి అమృతత్వాన్ని సాధించటానికి సాధకుడు చేయవలసినది, చేయ దగినది ఏదైనా ఉన్నదా? తప్పక ఉంది. కాని ఆ మార్గములో ప్రయాణం చేయగలుగుతాడా? దానికి ఏకైక మార్గం విచారణ. ఐహిక సంపదలు తనకు ప్రసాదించే పదము శాశ్వతమైనదేనా? తనను మృత్యువు నుండి అతిక్రమించగల్గే విధంగా తోడ్పతాయా? అనే వివేకవంతమైన విచారణ చేస్తే తప్పక తత్త్వదృష్టిపై మనస్సు లగ్నం కాక తప్పదు.

తత్త్వ దృష్టి ద్వారా సాధకుడు తత్త్వ సంపద యొక్క రుచిని చవి చూడగలుగుతాడు. వివేకవంతమైన విచారణ క్రమేపి సాధకునిలో దాగివున్న మోహాన్ని హరింపజేసి, అశాశ్వతమైన ఐహిక సుఖాలకు దూరమై మృత్యువును అతిక్రమించి అమృతత్త్వమును సాధించటం తథ్యం.

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

'మరణ సమయంలో మనస్సు ఎలా ఉంటుంది?' అనే విషయాన్ని అడిగిన భక్తుని ప్రశ్నకు సమాధానంగా శ్రీ బాబూజీ మహరాజ్ బోధ చేస్తూ " మరణవేదన చాలా భయంకరమైనది అది మీకు చెప్పకూడదు. మీకు చెప్తే హడలి ఛస్తారు. మృత్యువు అంటే ఎవరికైనా భయమే. కొంతమంది మాకు చావు అంటే భయంలేదు అనవచ్చు. మరికొంతమంది వ్యాధి సంక్రమించినప్పుడల్లా తమకు మృత్యువు ఆసన్నమైనదని భయపడి



దుఃఖిస్తారు. దానివల్ల ప్రయోజనం లేదు. సమర్థులైన సద్గురు మూర్తిని ఆశ్రయించి పటిష్ఠమైన సాధన చేసేవారు మాత్రం మృత్యువులంటే భయపడరు. గురుసాన్నిధ్యం లోనుండేవారికి భయపడవలసిన పని ఏమిటి? నశించేది ఈ దేహం. ఆ దేహాన్ని ప్రకాశింపచేసే ఆత్మవస్తువు నేను అని గుర్తించినవాడికి భయం వుండదు. కొంతమంది తమకు ఏదైనా కష్టం కలిగినపుడు మరణించాలని భావించవచ్చు. అది కేవలం నిరాశ, నిస్పృహతో కూడినది. అది శ్మశాన వైరాగ్యం వంటిదే. భగవద్గీత (2.27)లో చెప్పబడినట్లు జన్మించినవాడికి మృత్యువు తప్పదు. మృతిచెందినవాడు జన్మించక తప్పదు కదా! జనన మరణాలు అనివార్యమైనప్పుడు ఈ పరిణామం గురించి భయపడవలసిన పని లేదు. కాని, గురుపుత్రులైనవారు సద్గురుమూర్తిని ఆశ్రయించి, వారి ఆదేశానుసారముగా సాధన చేస్తే జనన మరణ దుఃఖవలయం నుండి బయటపడతారు.

మరణ సమయంలో మనస్సు మీరు చిన్నప్పటినుంచి చేసిన దుష్కృత కార్యములమీదనే నిలబడుతుంది. అప్పుడు పరమాత్ముడిపైన మనస్సు నిలబడటం దుర్లభం. మరణ వేదన కఫ, వాత, పిత్తములతో కూడి చాలా భయంకరంగా వుంటుంది. శరీరంలో ఉన్న వాయువులన్నీ బయట ఉన్న వాయువులలో లీనమవుతాయి. మృతి చెందిన మానవుని సూక్ష్మదేహం లేక మనస్సు వాసనలతో కూడి ఉదాన వాయువుతో సహా స్థూలదేహాన్ని విడిచి అనంతవాయువులో లీనమవుతుంది. వాసనలతో కూడిన మనస్సునే జీవుడు అంటారు. మేఘం వర్షించినపుడు వర్షపు

నీటితో పాటుగా బీజరూపముగా నున్న జీవుడు భూమిని చేరి సస్యముల ద్వారా పురుషుడిలో శుక్రకణరూపముగను, స్త్రీలో శోణితముగను వుంటాడు. శుక్ర, శోణితముల కలయిక ద్వారా ఏర్పడిన పిండము గర్భనరకము అనుభవించక తప్పదు. సస్యములతో కూడియున్న జీవుడు పొందేబాధ దుర్భరమైనది.

వరిచేలను కోస్తారు. వడ్లను మరపట్టిస్తారు. రొట్టెలకోసం పిండి తయారుచేస్తారు. రొట్టెలను నూనెతో వేపుతారు. అన్నమును పంటితో నములుతారు. ఇదంతా నరకలోక అనుభవమే కదా! దీనిని సూక్ష్మశరీరంలో ఉన్న జీవుడు అనుభవించక తప్పుతుందా! అలాగే జీవుడు గర్భ నరకాన్ని భరించలేక స్వామీ! ఈ బాధ నేను భరించలేను దీనినుండి విముక్తిలేదు. దీనికి విముక్తిని ప్రసాదించగల సమర్థులు సద్గురుమూర్తి మాత్రమే. ఆయనను ఆశ్రయించి ఆయన ప్రసాదించిన లక్ష్యార్థ సాధన చేస్తూ తద్విచారణ ద్వారా తానెవరో తాను తెలుసుకోనుటయే ముక్తి. అదే శరీర త్రయస్థితి నుండి విముక్తి.

జ్ఞాని మాత్రం తనమనస్సును అంతర్ముఖం చేసి దేహభావన మరచి నిరంతర ఆత్మానందంలో ఓలలాడుతూ ఉంటాడు. మానవుడు నిదురించే ముందు ఏ సంకల్పంతో మనస్సు అణిగిఉంటుందో తిరిగి అదే సంకల్పంతో మేల్కొంటాడు. అలాగే మృత్యువు సంభవించినపుడు ఏ సంకల్పంతో ఉంటాడో ఆ సంకల్పానికి తగిన పంజరం తయారవుతుంది. అదే పునర్జన్మకు కారణం అవుతుంది సుమా!

చంటి పిల్లవాడు ఇంద్రియ సహితుడే కాని ఏం చేస్తున్నాడో అది వాడికి తెలియదుకదా? సాధకుడు ఆ స్థితిలో ఉండగల్గుతాడా సందేహమే. ఈ దేహం నేను అనే భావన ఉన్నవాడికి ప్రాపంచిక దృష్టి తప్పదుకదా. మరి వాడికి శాంతి ఎక్కడిది? దారా పుత్రాదులకు, బంధువులకు దూరంగా వెళ్ళిపోయినంత మాత్రాన దేహభావన తొలగదు. నీలో మమత్వం తొలగదు. అది ఏనాడూ త్యాగం అనిపించుకోదు. నీలో మమత్వం తొలగాలి. శరీరం ఎక్కడ ఉన్నా భావనలో మార్పు రావాలి" అన్నారు.

ఏదైనా ఊరికి ప్రయాణం అయినపుడు ఆ ఊరు చేరటానికి రైలు ఎక్కుతాము. మన గమ్యస్థానం చేరేలోపుగా మధ్యలో ఎన్నో స్టేషనులు వస్తాయి. కాని మన దృష్టి మాత్రము గమ్యం మీదనే ఉంటుంది కదా! ఎప్పుడు మన ఊరు వస్తుందా అని ఎదురు చూస్తాం. అలాగే

ప్రాపంచిక విషయాలకు, ఆకర్షణలకు మనస్సు లొంగక గురుదేవుడు ప్రసాదించిన లక్ష్యార్థం మీదనే నిలపాలి. మనస్సుని అంతర్ముఖం చేయాలి. అజ్ఞానంతో మనస్సే నేను అని భావించిన సాధకుడు గురుమూర్తి బోధ వల్ల సత్యాన్ని గ్రహించి మనస్సు వేరు, నేను వేరు అని తెలుసుకొని మనస్సును కంట్రోలుచేయటానికి ప్రయత్నిస్తాడు. కాని అది సాధ్యపడుతుందా. పొయ్యిలో పుల్లలు మండుతున్నాయి. వాటిని నీరుపోసి ఆర్పి చల్లార్చారు అనుకొండి. ఆ పుల్లలో బొగ్గు మిగిలివుంటుంది. మళ్ళీ వెలిగిస్తే వెలిగే స్వభావం కలిగి ఉంటుంది. అలా కాకుండా ఆ కట్టె పూర్తిగా కాలితే ఆరిపోయి బూడిద అవుతుంది. దానిని మళ్ళీ వెలిగించినా వెలగదు.

అలాగే మనస్సును కూడా బలవంతంగా కంట్రోలు చేయాలంటే సాధ్యపడదు. వివేకవంతమైన విచారణ ద్వారా మనస్సుని నెమ్మదిగా స్వాధీన పరచుకోవాలి. ఈ కనపడే జగత్తు అంతా అశాశ్వతమైనది. శాశ్వతమైనది పరమాత్మ వస్తువు ఒక్కటే అనే భావన మనస్సులో ఆరూఢంగా నిలిచేలా సద్విచారణ చేయాలి. అంతేకాదు పరిపక్వ స్థితిలో నున్న సాధకుడికి అయిమాత్మా బ్రహ్మ అనే భావన ఆరూఢం అయితే అంతా తానే అని మనస్సు నిర్ణయిస్తే ఇంక మనస్సు దేనిమీదకు వెళ్ళదు. రెండవ వస్తువు ఉంటే మనస్సు అటువైపు తిరుగుతుంది. కాని భావనలో అంతా తానే అని ఆరూఢం అయినపుడు మనస్సు తప్పక అంతర్ముఖం అవుతుంది.

ఈ శరీరం లేదా ఈ దేహం భగవంతుడు ప్రసాదించిన పరికరం. దీనిని జాగ్రత్తగా కాపాడుకునే నిమిత్తం తగినంత ఆహారం తీసుకోవాలి. శరీరాన్ని ఎందుకు కాపాడుకోవాలి? అని మీరు ప్రశ్నించవచ్చు. సాధన చేయటానికి శరీరం అవసరం కదా అందువలన ఈ విషయంలో శ్రద్ధ వహించక తప్పదు. సాధన ఎందుకు చేయాలి? అనే ప్రశ్న వుదయించ వచ్చు. జన్మకు వచ్చిన ప్రతిసాధకుడు జనన మరణ వలయం నుండి తప్పించుకుని పునర్జన్మ లేకుండా చేసుకొని ముముక్షత్వాన్ని పొందటానికి సద్గురుమూర్తి నిర్దేశించిన సాధన ఒక్కటే శరణ్యము అని గ్రహించాలి" అన్నారు.

(గత సంచిక తరువాయి) **అమ్మ మాట** - జపమాల ప్రసాద

# మంత్రమూలం - గురోర్వాక్యం

ఇక ఆ తరువాత చరణంలో - ఎంతో అత్యంత ఉన్నతమైన భావానికి తీసుకునివెళ్ళారు స్వామి. 'అదినాది - ఇదినాది అని ఎందుకు రా విర్రవీగుతావు. ఇదేదీ నాది కాదురా! నీలోని ఆ 'నేను-నాది' అనే అహంకార మమకారములు రెండూ దూరమైనప్పుడే నీవు నీవుగా నిలిచెదవురా. ఇదే స్కందోపనిషత్తు చెప్తోంది. 'తుషేణ బద్ధో వ్రీహిస్స్యాత్ తుషా భావేతు తండులః' అని. ఆ బియ్యపుగింజని పైన రెండు పొరలు ఉన్నంతసేపూ దానిని ధాన్యపు గింజ అంటున్నాం. ఆ వడ్లగింజకి ఉన్న రెండు పొరలు తొలగించి వేస్తే అదే బియ్యపుగింజ అవుతోంది.

ఆ బియ్యపు గింజని కబళించి ఉన్న ఆ రెండు పొరలే అహంకార మమకారాలు. ఆ పైన నూగే సంకల్పములు. ఎప్పుడయితే యీ రెండు పొరలు తొలగి పోతాయో యిక దానికి బీజాంకురమే లేదు. ఆ బియ్యపు గింజని వండితే అన్నం అవుతోంది. అన్నం పరబ్రహ్మం. అది మన క్షుద్బాధని తీరుస్తుంది. బియ్యపు గింజకు పునర్జన్మ లేదు. కాని వడ్లగింజకు పునర్జన్మ వుంది. అది మన క్షుద్బాధని తీర్చలేదు.

అలాగే జీవుడికి ఆ అహంకార మమకారాములనే రెండు పొరలు తొలగిపోయేసరికి మానవుడే మాధవుడు అవుతాడు. బియ్యం తిరిగి ధాన్యం ఎలా అవదో, అహంకార మమకారాలు తొలగి మాధవుడుగా మారిన జీవుడు కూడా తిరిగి మానవుడు అవడు. ఈ అహంకార మమకారాలు రెండూ ఎలా పోతాయి? కేవలం సద్గురుమూర్తికి దాసోహం అనడం వలన. గురుకృప వలన. గురువాక్య పరిపాలన వలన అది జరుగుతుంది. 'ఇది నిజము రా! ఇదే సత్యము రా!' అనే మహోన్నత భావాన్ని మనకు అందించి, చివరి చరణంలో మళ్ళీ జాగ్రత్త! కబర్దార్! అని చెబుతున్నారు.

'కామ క్రోధ మద లోభ మోహ మాత్సర్యములనే ఆరు శత్రువులు నీలో ఉన్నాయి చూశావా! అవి నీకు కనబడకుండానే నిన్ను కబళించి

వేస్తాయి. వాటికి నువ్వు దాసుడవైపోతావు. ఆ ఆరు పొరలు నీ దృష్టిని కప్పివేస్తే నీకు సత్యమార్గం ఎక్కడ కనబడుతుంది? అయితే అప్పుడు కూడా ఒక ఉపాయం వుంది. అప్పుడు కూడా నిన్ను రక్షించేది ఒక్క గురుపాదములు మాత్రమే! కనుక ఆ మాధవుని (గురుమూర్తిని) స్మరించరా!

చూశారా! ఎంత చక్కటి బోధో! మరి యింత బోధ మనకి గురుమూర్తిచే అందించడానికి ఒక కారణంగా అక్కడ నిలిచిన శ్రీమతి సువర్చలమ్మగారిని గురించి కూడా కొంచెం చెప్పుకుందాం. ఆవిడ టెలిఫోన్ ఆపరేటర్‌గా పనిచేసి రిటైర్ అయి, మన ఆశ్రమంలోనే స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. పాపం! ఆవిడ చివరిలో కాన్సర్ వ్యాధితో చాలా బాధ పడ్డారు. ఆవిడ శ్రీబాబు చేత 'అత్తయ్యా!' అని పిలిపించుకున్న భాగ్యశాలి. ఆవిడకి శ్రీబాబు దగ్గర నుండి లక్ష్యార్థం తీసుకోవాలని చాలా కోరిక ఉండేది. మరి బాబుతో డైరెక్ట్‌గా చెప్పే అవకాశం దొరకకో, లేక భయం చేతనో, నా దగ్గరకి వచ్చి ప్రతిరోజూ ఉదయం నా దగ్గరకు వచ్చి 'అమ్మా! చంద్రా! నువ్వు చెప్పమ్మా బాబుతో నాకు లక్ష్యార్థం ప్రసాదించమని' అని, సరే నేను రాయబారం చేసేదానిని. ప్రతిరోజూ నాన్నగారితో ఆవిడ మాట చెప్పేదాన్ని. ఆయన విని ఊరుకునేవారు. ఏమీ మాట్లాడేవారు కాదు. ఆవిడ మళ్ళీ నన్ను అడిగేది స్వామి ఏమన్నారని. నేను "అమ్మా! నేను చెప్పాను. ఆయన విన్నారు. మీరేమీ భయపడకండి. ఆయన తప్పకుండా అనుగ్రహిస్తారు" అనేదాన్ని.

ఇంతలో ఆవిడ తుది రోజు రానేవచ్చింది. ఆవిడ కన్నుమూసింది. నాన్నగారు లక్ష్యార్థం ఈయనే లేదు. ఉండండి! ఉండండి! అప్పుడే కథ అయిపోలేదు. నేనూరుకుంటానా! వెళ్ళి శ్రీబాబుతోటి "అయ్యో! పాపం! సువర్చలమ్మగారు పోయారు. లక్ష్యార్థం తీసుకోవాలని ఎంతో అనుకున్నారు. పాపం. ఇక ఈ జన్మకి ఆ అదృష్టం లేదు కదా!" అన్నాను.

వెంటనే బాబు చాలా తీవ్రంగా "ఏం! సువర్చలమ్మకి ఏమి తక్కువ అయింది? ఆఖరి శ్వాస వదిలేటప్పుడు ఆమె లక్ష్యం దేనిమీద ఉంది? ఆమె 'బాబూ' అని శ్వాస వదిలింది. మరి 'బాబు' అంటే ఎవరు? ఏదో లక్ష్యార్థం తీసుకున్నామంటే తీసుకుని, దానిని బుట్టదాఖలు చేసి, విస్మరించేకంటే, తీసుకోకుండానయినా, చివరి క్షణం వరకూ అదే

ఆవేదనతో 'అయ్యో! నా గురుమూర్తి ముద్ర నాకు లభ్యం అవలేదే! ఎప్పుడు నా గురుమూర్తి నన్ను అనుగ్రహిస్తారో కదా!" అని స్వాతి చినుకు కోసం నోరు తెరచుకుని ఉన్న ముత్యపు చిప్పలాగ ఆ గురుమూర్తి మీదనే ఏకైక దృష్టిని నిలిపి, అంతిమ శ్వాస వదిలితే, యిక లక్ష్యం ఎక్కడ నిలచినట్లు? ఆ జీవుడికి యిక మరో జన్మ ఏదీ?" అన్నారు.

చూశారా! 'మంత్రమూలం గురోర్వాక్యం' అన్నది గురుగీత. గురు దేవుల నోటివెంట వచ్చిన ప్రతి వాక్కూ మంత్రమే. దానిని ఆచరిస్తే చాలు. మనం తరించడానికి. మరి మన ఆశ్రమంలో మనం చూస్తున్నాం కదా! ఎవరు పోయినా అంతిమ శ్వాస వదిలిపెట్టేటప్పుడు 'బాబా!' అనే వెళ్ళి పోతున్నారు. ఇక వారు ఎక్కడికి వెళతారు? ఆ గురుమూర్తిలోనే లీనమయి పోతున్నారు. అటువంటి తీవ్రవైరాగ్యము, ఆవేదన, గురు పాదముల యందు అచంచలమైన భక్తి కలిగినవారికి మోక్షము కరతలామలకమే!

## *సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి*

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఏప్రియల్ 2016, మే 2016 ల లో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

ఏప్రియల్ 2016 : AS 4166, 6371, 6859, 6861, 7096, 7097, 7098, AS 7099, 7100, 7101, 7102, 7107, 7108, 7116, AS 7119.

మే 2016 : AS5922, 5960, 6388, 6390, 6391, 6613, 6866, 7120, 7121, AS7122, 7123, 7126.

– మేనేజర్

# యోగిని శ్రీ చంద్రకాళీప్రసాద మాతాజీవారి ఆశ్రమేతర కార్యక్రమ వివరాలు

<u>ఏప్రియల్ 2016</u>

1)1-4-16 నుండి 3-4-16 వరకు శ్రీ శాంతి ఆశ్రమం, తోటపల్లి (తూర్పు గోదావరి జిల్లా) శతాబ్ధి ఉత్సవాలలో శ్రీ మాతాజీ ప్రవచనములు.

2)17-4-16 గన్నవరంలో శ్రీ మళయాళస్వామి వారి 131వ జయంతి కార్యక్రమాలలో శ్రీ మాతాజీ ప్రవచనం. **s.v.r** ఫంక్షన్‌హాల్, దావాజి గూడెం.

3)19-4-16 ప్రకాశం జిల్లా పర్చూరు మండలం, చెరుకూరు గ్రామంలో శ్రీ సుబ్బదాస స్వామివారి ఆరాధన కార్యక్రమాలలో శ్రీమాతాజీ ప్రవచనం.

4)21-4-16 నుండి 25-4-16 వరకు శ్రీ కాళహస్తి శ్రీ శుక బ్రహ్మాశ్రమము పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారి 18వ ఆరాధన, 103వ జన్మ దినోత్సవం, 66వ ఆశ్రమ వార్షికోత్సవాలలో శ్రీమాతాజీ ప్రవచనములు.

<u>మే 2016</u>

1)16-5-16 ప్రకాశం జిల్లా పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలో శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన కార్యక్రమములలో శ్రీ మాతాజీ ప్రవచనం.

పాఠకులకు

నూతన

'దుర్ముఖి'నామ సంవత్సరాది

శుభాకాంక్షలు



# సకల పీడా పరిహారకుడు సద్గురుదేవుడు

- భోగరాజు భారతీదేవి

శ్రీబాబు "నా తపశ్శక్తినంతటినీ ధారపోసి, ప్రతిష్ఠించిన దేవాలయాలలోని యీ దివ్యమూర్తులు అఖండ చైతన్యశక్తివంతములు. మీ శక్తి కొలది, భక్తికొలది అర్చించుకుని ఇహపరాలలో దేనిని మీరు కోరితే అవి లభిస్తాయి" అని ఆలయాల ప్రతిష్ఠలను గురించి చెబుతూ యిలా ఉద్ఘోషించారు. అదే విశ్వాసంతో ఆచరించుకున్న భక్తులకి సకల శాంతి సౌఖ్యాలు చేకూరుతాయి అని నా అనుభవంతో చెప్తున్నాను.

నా మనవడు వడుగుకి ముహూర్తం పెట్టుకుని, ఒక మంచి రోజు చూసి వినాయకుడికి ముడుపు కట్టుకున్నాము. ఆనాడే మేము కారులో వెడుతుంటే ఒక పిల్లి కారు క్రింద పడి చనిపోయింది. దానితో మా అందరి మనస్సులు వికలం అయ్యాయి.

అప్పుడు నేను మా ఇలవేల్పు గురుదేవులను స్మరించుకున్నాను. స్వామి ఒక సంకల్పాన్ని కలిగించారు మనస్సులో. అప్పటికి వడుగు సరిగ్గా 41 రోజులుంది. అప్పుడే కార్తీకమాసం జరుగుతోంది.

శ్రీ కాళీవనాశ్రమంలోని శ్రీరామలింగేశ్వరునికి మండలం రోజులు అభిషేకానికి గోత్రం పేరు యిచ్చి అభిషేకాలు చేయించాము. శ్రీ రామలింగేశ్వర స్వరూపులైన శ్రీగురుదేవుల అవ్యాజ కరుణా ప్రసారం వల్ల శుభకార్యం నిర్విఘ్నంగా నెరవేరింది. మా మనస్సులు తేలికబడి పరమశాంతిని పొందాయి.

స్వామి దివ్యానుగ్రహాన్ని ఎన్నిసార్లో చవి చూశాము. స్వామి తోడు నీడగా నిలబడి అనుక్షణం మా జీవితాలకు రక్షకుడై సర్వదా ఉంటున్నారు అనే ప్రగాఢ విశ్వాసం మాకు చేయూతనిస్తున్నది.

అపారమైనది గురు మహిమ!!

(గత సంచిక తరువాయి) **స్వామి రామతీర్థ** - రమణ ప్రసాద్

శ్రీబాబూజీ మహరాజ్‌వారు స్వామి రామతీర్థ గురించి ఇలా చెప్పేవారు- “ఒకసారి స్వామి రామతీర్థ దక్షిణదేశానికి వచ్చారు. వారు ఒకచోట భగవద్గీతపైన ఉపన్యసిస్తున్నారు. ఆయన సంస్కృత శ్లోకాలు స్వచ్ఛంగా చదవటంలేదని కొందరు, ఆయన ఆంగ్లంలోచేసే ప్రసంగం అర్థంకాక కొందరు లేచి వెళ్లిపోయారు. వారి ప్రసంగం పూర్తి అయ్యేసరికి ఒక్కడు మాత్రం కూర్చుని కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్నాడు. ‘ మీరు ఎందుకు ఏడుస్తున్నారు?’ అని అడుగగా,‘అనన్యాశ్చింతయంతోమాం యేజనా పర్యుపాసతే। తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥ ఆ శ్లోకానికి అర్థం చెబుతూ తమరు భగవంతుని సతతం చింతించేవారి యోగక్షేమం తనే చూస్తాడని చెప్పి ఉన్నారు. నేను భగవంతుని అలా చింతించలేక పోతున్నానే అని విచారిస్తున్నాను’ అన్నాడు. స్వామి రామతీర్థ ‘నువ్వొకడివే భగవద్గీతలోని అంతరార్థాన్ని సరిగా అర్థం చేసుకొన్నావు” అని అభినందించారు’ అని చెప్పి భగవద్గీత పైపైన చదవటం కాదు. దాని లోతులలోకి వెళ్లాలి” అని బోధ చేశారు.



స్వామి రామతీర్థ గురించిన ఇంకొక ఉదంతం - స్వామి రామతీర్థ అమెరికా వెళ్ళి ఎన్నో కష్టాలకు గురి అయ్యాడు. ఆయన వద్ద తగినంత ధనం లేదు. ఆయన వీధిలో నడుస్తుంటే ఆయన వింత వేషభాషలను చూసి కొందరు ఆయనమీద రాళ్ళు విసురుతూ, ‘రెడ్ మంకీ! రెడ్ మంకీ!’ అని అరిచారు. స్వామి తనకు తగిలిన దెబ్బలు లెక్క చేయకుండా, వారితో, ‘అయామ్ నాట్ మంకీ. మై మైండ్ ఈజ్ మంకీ’ అని చెప్పారు. అక్కడ ఉన్నవారు ఈయన గొప్ప మహాత్ముడని గుర్తించి వారిని తమతో తీసుకొని వెళ్ళారు. ఆ తరువాత స్వామి రామతీర్థ శాన్‌ఫ్రాన్సిస్‌కోలో చేసిన ప్రసంగం అమెరికా ప్రజలను ఎంతో ఆకట్టు కోవటమే కాక ఆయన ఇచ్చిన సందేశాలకు ఎంతో ప్రభావితులనారు.

స్వదేశానికి తిరిగి వచ్చి విరామం లేకుండా ఎన్నో వేదాంత ప్రసంగాలు చేశారు. దాంతో ఆయన ఆరోగ్యం బాగా దెబ్బతింది. హిమాలయాలకు తిరిగి వచ్చి అక్కడ వసిష్ఠాశ్రమంలో ఉండసాగారు. ఆయన నారాయణునితో,“ నారాయణా! రాముడు త్వరలో మౌనము

వహించును. అతని లేఖిని, నాలుక పని చేయవు.. నా ప్రతినిధిగా నీవు పనిచేయుము. దుఃఖింపవలదు. రాముడు నీతోనే, నీయందే వున్నాడనుకొనుము." అని చెప్పగా నారాయణుని దుఃఖమునకు మితి లేదు. భోరున ఏడ్చుస్తూ స్వామి పాదాలపై పడ్డాడు. రాముడు అతనిని లేవనెత్తి ఓదార్చాడు.

1906 వ సం॥ అక్టోబరు 17వ తేది. ఆనాడు దీపావళి. ఆ నాటికి రామతీర్థునకు 33 సంవత్సరాలు నిండాయి. కొన్ని రోజుల తరువాత స్వామి నదిలో స్నానము చేయుచు శరీర త్యాగం చేశారు. ఆయన కాళ్ళు పద్మాసనములో ఉన్నాయి. చేతులు వ్రేళ్ళ సందున ఒకదానిలో వొకటి చేరి ఉన్నాయి.. ఓంకారోచ్ఛారణము చేస్తున్నట్లు ఆయన పెదవులు విచ్చుకొని ఉన్నాయి. ఈ విధంగా ది 27 అక్టోబరు 1906లో ఆయన జల సమాధి పొందిరాని తెలుస్తోంది.

స్వామి రామతీర్థ ఆంగ్లంలో,ఉర్దులో ఎన్నో కవితలు వ్రాశారు. వారి ఆంగ్ల కవితలు సి.ఎఫ్. ఆండ్రూస్ వంటి వ్యక్తి ఉపోద్ఘాతంతో వెలువడ్డాయి.

*What care for caste or creed*
*It is in deed, it is the deed,*
*What for class and what for clan*
*It is the man. it is the man,*
*What for crown and what for the crest*
*It is the heart within the breast.*

ఆయన దేశపౌరులను ఉద్దేశిస్తూ," ప్రియతమ సనాతన ధర్మీయులారా! మీరు శాస్త్రాలయందు సరియైన అవగాహన కలిగి వుండండి. మూఢ ఆచార వ్యవహారాలను విడనాడండి." అన్నారు. " నా మతానికి పేరు లేదు. ప్రకృతియే నామతం. అందరి మతమే నా మతం.

ప్రజలలో అజ్ఞానాన్ని,అంధవిశ్వాసాలను రూపుమాపటానికి ఆయన నిరంతర కృషి చేశారు. మానవులలో పేరుకున్న అజ్ఞానాన్ని తొలగించి వారికి నువ్వు ఇవ్వగలిగే గొప్ప బహుమానమే జ్ఞానం" అన్నారు.

స్వామి రామ తీర్థ ఈనాడు సశరీరులుగా లేకపోయినా వారు ఎప్పటికీ చిరంజీవులే. వారు సచ్చిదానంద స్వరూపులు.ఆధ్యాత్మిక రంగంలో ఆయన ధృవతారగా ప్రకాశిస్తూనే ఉంటారు.

# హనుమాన్ చాలీసా

(గత సంచిక తరువాయి)

- కొంపెల్ల రామకృష్ణ(లండన్)



8. ప్రభుచరిత్ర సునివేకో రసియా ।
రామలఖన సీతా మన బసియా ॥

రసికత అంటే ఒక విషయంలో ఆసక్తి, యిష్టం కలిగి వుండటం. రాముని కథ వినడంలో స్వామికి ఆసక్తి వున్నది. సీతా రామలక్ష్మణులను మనస్సులో నిలబెట్టుకున్నాడు హనుమ.

9. సూక్ష్మరూపధరి సియహి దిఖావా ।
వికటరూపధరి లంక జలావా ॥

10. భీమరూప ధరి అసుర సంహారే ।
రామ చంద్రకే కాజ సవారే ॥

సూక్ష్మరూపంలో సీతాదేవికి అశోకవనంలో కనబడతాడు. వికట రూపంలో లంకిణి మొదలగు రాక్షసులను భయభ్రాంతులకు గురి చేస్తాడు. మహా భయంకర రూపంలో రాక్షస సంహారం చేస్తాడు. ఇలా రామ కార్యాన్ని సాధించటానికి పలురూపాలు ధరించాడు.

11. లాయ సజీవన లఖన జియాయే ।
శ్రీ రఘువీర హరఖి ఉరలాయే ॥

సంజీవినీ పర్వతాన్ని తెచ్చి లక్ష్మణుని బ్రతికించాడు. దీనికి రాముడు ఎంతగానో సంతోషించి హనుమను ఆలింగనం చేసుకున్నాడు. ఇది హనుమకు మహాభాగ్యం!

రామాయణంలో రాముడుకి రెండుసార్లు వియోగం నుండి హనుమ కాపాడాడు. సీతావియోగంలో ఒకసారి, లక్ష్మణుడు మూర్ఛిల్లినప్పుడు రెండోసారి దుఃఖిస్తున్న రామునికి హనుమ ఆనందాన్ని కలిగించాడు.

12. రఘుపతి కిన్హీ బహుతబఢాయీ ।
కహాభరత సమ తుమ ప్రియ భాయీ॥

రఘుపతి ఎంతో గొప్పవాడవని ప్రశంసించాడు. 'నాకు భరతునితో సమానం' అన్నాడు.

13. సహస వదన తుమ్హరో యశగావై।
అసకహి శ్రీపతి కంఠ లగావై॥
వేనోళ్ళతో రాముడు హనుమను పొగిడి ఆలింగనం చేసుకున్నాడు.
14. సనకాది బ్రహ్మాది మునీశా।
నారద శారద సహిత అహీశా॥
సనకాది మునులు, బ్రహ్మ, నారదుడు, సరస్వతి, ఆది శేషువు మొదలగు వారందరూ నిన్ను కీర్తించారు.
15. యమ కుబేర దిగపాల జహాతే।
కవి కోవిద కహై సకై కహాతే॥
యముడు కుబేరుడు దిక్పాలకులు వారి వల్ల కానిది సామాన్య మానవులు కవులు, పండితులు నిన్ను ఎంతని ఎలా కీర్తించగలరు వారికి అసాధ్యం.
16. తుమ ఉపకార సుగ్రీవ కీన్హా।
రామ మిలాయ రాజపద దీన్హా॥
నువ్వు సుగ్రీవునికి ఎంతో ఉపకారం చేశావు. రామునితో స్నేహాన్ని కలిపి, వాలిని వధింపజేసి, రాముని ద్వారా సుగ్రీవునికి రాజ్యం యిప్పించావు
17. తుమ్హరో మంత్ర విభీషణ మానా।
లంకేశ్వర భయ సబజగ జానా॥
నీ సలహాను పాటించి విభీషణుడు లంకకు రాజయ్యాడు. హనుమ సలహాతోనే విభీషణుడు రాముని శరణుపొందాడు. హనుమ చెబితేనే రాముడు విభీషణునికి ఆశ్రయం ఇచ్చాడు. కనుక హనుమను ఆశ్రయిస్తే మనలను కూడా రాముని దగ్గరకు చేర్చుతాడు.
18. యుగ సహస్రయోజన పరభానూ।
లీల్యోతాహి మధురఫల జానూ॥
19. ప్రభు ముద్రికా మేలిముఖమాహీ।
జలధిలాంఘికే అచరజనాహీ॥
వేయియోజనాలు దూరంలోవున్న సూర్యభగవానుని ఫలమని భ్రమించి తినబోయాడు. అట్టి పరాక్రమశాలికి రామచంద్రుని ముద్రికను పట్టుకుని సముద్రాన్ని దాటటంలో ఆశ్చర్యమేమున్నది? రామమంత్రాన్ని జపించేవాడు ఎటువంటి కష్టాలనైనా అధిగమించగలడు!

- సశేషం

(గత సంచిక తరువాయి) # యోగవాశిష్ఠము - సుషుమ్నా ప్రసాద

'ఓం' లోని మొదటి మాత్ర అకార పూరకంతో రేచకం, అంటే ప్రాణవాయువును వదలటం, ఇది ప్రణవ యోగానుభవములో మొదటి దశ. హృదయములో ప్రభవించే అగ్ని, శరీరమంతా వ్యాపించి, భగ్గుమంటుంది. ఈ రేచక స్థితినతడు ఏ హఠ యోగాభ్యాసము వలన చేరుకోలేదు. రెండవ దశ అంటే ప్రణవములో ఉకార పూరకంతో శ్వాసను బిగబట్టటం జరుగుతుంది, అది కుంభక దశ. ఈ దశలో, అంతకు ముందు శరీరాన్ని దహించిన అగ్నిమెరుపు తీగ తళుక్కుమన్నట్లు వొకత్తృటిలో యెగిరిపోతుంది. శరీరము కాలిన భస్మములా తెల్లగా అవుతుంది, ప్రణవ యోగంలోని, యీ రెండవ దశ కూడ, అతను చేరుకున్నాడు. ఇక మూడవ దశలో, ప్రణవంలోని మకార పూరకంలో శ్వాసను వదలటం జరుగుతుంది, దీనిని పూరకమంటారు. ఉద్ధాలకుడిప్పడు సంపూర్ణ విశ్రాంతితో, ఆనందిస్తున్నాడు, ఉద్ధాలకుని శరీరము విష్ణుమూర్తి రూపంలా ప్రకాశవంతమయింది.



"అతను ప్రాణాయామము చేసి, ప్రాణ, అపాన వాయువుల నడుపులో పెట్టుకొన్నాడు, ప్రాణవాయువును బయటకు పోనివ్వకుండా, నవ రంధ్రములను మూసుకొన్నాడు, అప్పడు తను చాలా కష్టంతో తన యింద్రియాలను విషయాకర్షణను అరికట్టాడు. అతను అణగిన మనసును, హృదయకవాటములో, యిముడ్చుకొన్నాడు, చాలా దుష్కరమైన పోరాటంతో, తన సంకల్పాలన్నిటినీ విఛ్ఛిన్నం చేసుకొన్నాడు.

తన ప్రమేయం లేకుండా, సందేహ సమూహమతనిలో చెలరేగాయి, హేతువామనే ఖడ్గంతో, ఉద్ధాలకుడు నాయకుడు శత్రువులను సంహరించినట్లు, ధైర్యంగా యెదుర్కొని లొంగ దీసుకొన్నాడు. తర్వాత నిత్యా నిత్య వస్తు వివేకముతో, మానసిక అంధకారమును పారద్రోలాడు, తర్వాత తన ముందతను అందమైన జ్యోతుల సమూహాన్ని గమనించాడు. వెంటనే తను యీ దశను కూడ అధిగమించాడు. అతనికి తర్వాత మత్తుగా వున్నది వెంటనే తన

నిద్రమత్తుకు స్వస్తి చెప్పాడు, తర్వాత విస్తరించిన అనంతమైన ఆకాశాన్ని దర్శించాడు. తర్వాత మోహామడ్డు వచ్చింది, దానిని కూడ విజయవంతంగా పాలద్రోలాడు, అప్పడతను చీకటి, వెలుగు, నిద్ర, ఆకాశము, మోహములనధిగమించి, వర్ణనాతీతమైన నిర్వికల్ప సమాధిని చేరుకొన్నాడు. ఆ స్థితి వర్ణనాతీతమైనది, కనిపించేవన్నీ, అదృశ్యమయ్యాయి, అమృతమనే సాగరములో సంపూర్తిగా మునిగి పోయాడు. నిత్యానందమై, అవ్యక్తమైన తేజస్సుతో ప్రకాశించే, బ్రహ్మత్వ స్థితిని చేరుకొన్నాడు, అన్ని రకాల బాధల నుండి విముక్తుడైనాడు, నీటి మీద యెగిరే హంసలా, సంతోషమనే సముద్రంలో యీదాడు.

ఆరు నెలల తర్వాత, ఉద్ధాలకుడు సమాధి స్థితి నుండి మేల్కొన్నాడు, సిద్ధులు, దేవతలు, దేవ కన్యలు అతన్ని ప్రలోభపరచటానికి, చుట్టుముట్టారు, అతన్నాకర్షించటానికి ప్రయత్నించారు, దేవేంద్రుడతనికి దేవలోకాన్నే యిస్తానన్నాడు, కాని ఉద్ధాలకుడు నిరాకరించాడు.

అప్పడు దేవతలతనితో యిలా అన్నారు "ఓ పూజ్య మహర్షీ! మేమిక్కడ నీకోసం, అభినందనలతో, వేచియున్నాము, ఇదిగో, మా దివ్య రథమునెక్కితే, నీవు దేవలోకానికి రాగలవు, స్వర్గమునకు మించిన సౌఖ్యాలెక్కడా లేవు, నీవిక్కడ నీ కోరికలన్నింటిని సంపూర్తిగా నెరవేర్చుకోవచ్చు. సౌందర్యానికి నిర్వచనమైన దేవకన్యలను చూడు, వారు వింజామరలతో, పుష్పగుచ్ఛాలతో, నీకై వేచివున్నారు, స్వర్గములో లభించే, ఆనందమునకు దీటైనది మరియొకటిలేదు, ఈ కల్పాంతముల వరకు, నీవు స్వర్గ సౌఖ్యాలననుభవించవచ్చు, నీవు చేసే యీ తపస్సంతా స్వర్గ సౌఖ్యాలను, సంపూర్తిగా ఆస్వాదించటానికే గదా".

" కాని ఉద్దాలకుడు దేవతలెరజూపిన ఆకర్షణలకు కించిత్తైనా చలించలేదు, దేవకాంత సోయగాలు, వయ్యారాలకు అతను లొంగిపోలేదు, వారిని తగు మన్ననతో గౌరవించాడు. వారిని ప్రశాంతంగా అక్కడ నుండి వెళ్ళిపొమ్మని విజ్ఞప్తి చేశాడు, వారు తమ ఆకర్షణలతో, ఉద్దాలకునికించిత్తైనా చలింపలేమని, యిక అక్కడ వేచివుండటము నిష్ప్రయోజనమని గ్రహించారు. అందువల్ల వారు తిరిగి వారి దేవలోకమునకు వెళ్ళిపోయారు.

- సశేషం

# మహామనీషి శ్రీ కొండ వెంకటరాజుగారికి నివాళి

శ్రీ వెంకటరాజుగారు శ్రీ శేషంరాజు, కృష్ణవేణమ్మల ప్రథమ కుమారుడు. వీరు ఇంజనీరింగ్‌లో పట్ట భద్రులు. ఉద్యోగ రీత్యా వీరు బి. హెచ్. పి. వి, ఇ.ఐ. యల్ మొదలైన ప్రభుత్వ సంస్థలలో పని చేసి కువైట్‌లో కొన్ని సంవత్సరములు పనిచేసి 2004లో ఇండియాకు వచ్చి ఏలూరులో స్థిరపడ్డారు. వీరి వయస్సు 69 సంవత్సరాలు వీరి ఒక్కగానొక్క కుమారుడు శ్రీ శేష ప్రసాద్ గారు. వారు నార్వేలో పని చేస్తున్నారు.



శ్రీ వెంకటరాజుగారు శ్రీమాతాజీ వారిని దర్శించి వారు సూచించిన విధంగా గత నాలుగు సంత్సరాలుగా ఆశ్రమవాసం చేస్తున్నారు. ఆశ్రమానికి వచ్చిన తరువాత వారు గురుకులంలోని బాలబాలికలు చక్కగా చదువుకొని పైకి రావాలనే ఉన్నతమైన ఆదర్శంతో వారు ఒక కోటి యాభైమూడు లక్షలు ఆ్రశమానికి దానంగా ఇచ్చి " శ్రీ చంద్రకాళీ విద్యానిధి" పేరుతో బ్యాంకులో వేసి దానిపైన వచ్చిన వడ్డీతో ఆశ్రమ విద్యార్థి విద్యార్థినులకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రారంభించారు. వారికి స్కాలర్‌షిప్పులు యిచ్చారు. ఉచితంగా పుస్తకాలు, యూనిఫారాలు అందించారు. స్కూలు అయిన తరువాత వారికి కోచింగ్ క్లాసులు పెట్టి, టీచర్లకు అదనంగా పారితోషికాలు ఇచ్చి, వారు మంచి ర్యాంకులతో ఉత్తీర్ణులైయ్యేటట్లుగా చేశారు. లోయర్ క్లాసుల పిల్లలకి మధ్యాహ్న భోజన వసతి కలిగించారు. బాల బాలికలకు స్పోకెన్ ఇంగ్లీషులో తర్ఫీదు ఇప్పించారు. రోజూ స్కూల్ ప్రేయర్‌లో ప్రేరణాత్మకమైన కథలు చెప్పి వారిచేత కూడాచెప్పించేవారు. బాగా చెప్పిన వాళ్ళకు ప్రైజులు ఇచ్చి ఉత్సాహ పరిచేవారు. అనేకమంది ఉన్నత విద్య అభ్యసించటానికి వీరు ధన సహాయం చేశారు.

వీరి కుమారుడు శ్రీ శేష ప్రసాద్ గారు వారి తండ్రిగారైన శ్రీ వెంకటరాజు గారి గురించి ఈ విధంగా తెలియచేస్తున్నారు :

" He said that education was important for the kids and that an educated kid will help bring his/her family out of poverty, also that with education kids will devolop *vivekam.* He devised many schemes to attract kids especially their parents to ensure their attendance in the school.He considererd kids his own. He also wanted to help the unprivileged financially.

వీరి ప్రోద్బలం చేత భవ్యమైన స్కూల్ ఎక్స్‌టెంషన్ బిల్డింగ్ ఏర్పడింది. అర్హులైనవారికి ఎవరైన సరే వారికి ధన సహాయం అందించారు. ముఖ్యంగా ఎవరైనా డబ్బు ఇబ్బందులవల్ల తమ పిల్లలను చదువు మాన్పించాలని తలిస్తే వీరు వారి తలి దండ్రులతో మాట్లాడి ఆ విద్యార్థుల చదువుకి భంగం రాకుండా చూసేవారు. విద్యార్థులు చక్కగా చదివి పైకి రావాలనేదే వారి ఆకాంక్ష, ఆశయం. శ్రీ వెంకటరాజుగారు కొంతకాలంగా అస్వస్థతతో ఉండి ది.24.02.2016 న ఆశ్రవాసులందరినీ, ముఖ్యంగా గురుకుల బాల బాలికలను శోక సముద్రంలో ముంచి గురు సాయుజ్యాన్ని పొందారు.

శ్రీ మాతాజీ వారు వీరిగురించి మాట్లాడుతూ," శ్రీ వెంకటరాజుగారు గత నాలుగు సంవత్సరాలుగా గురుకులానికి ఎనలేని సేవలను అందించి కర్మ రహితం చేసుకొన్నారు. శ్రీ గురుదేవులలో ఐక్యమై అనంతంగా ప్రకాశిస్తున్నారు. శ్రీగురుదేవులు వీరి కుటుంబ సభ్యులకు మనశ్శాంతిని ప్రసాదించుగాక! " అన్నారు.

భర్తృహరి"ధీరుల్ విఘ్న నిహన్య మాన్యులగుచున్ ధృత్యున్నతోత్సాహులై ప్రారబ్ధార్థములుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ కావునన్" అని చెప్పినట్లుగా శ్రీ వెంకటరాజుగారు తాము తలపెట్టిన సంక్షేమ పథకాలను ఎన్ని అడ్డంకులు వచ్చినా లెక్క చేయక సూటిగా అమలులోకి తెచ్చేవారు. శ్రీ వెంకట్రాజుగారు అట్టి ప్రజ్ఞానిధులు, మహామనీషి. మనందరి హృదయాలలో చెరగని ముద్ర వేసిన గొప్పవ్యక్తి.

శ్రీ వెంకటరాజుగారికి నివాళులు అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని, మనశ్శాంతి ని శ్రీ గురుదేవులు ప్రసాదించెదరుగాక! అని శ్రీగురుదేవులను ప్రార్థిస్తున్నాము.

# గురుకాలను [గుండుగొలను] శాఖ ఆవిష్కరణ

సర్వాధిష్ఠాన చైతన్య సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి పరమానుగ్రహంతో, పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారి దివ్యాశీస్సులతో, స్వస్తి శ్రీ మన్మధనామ సంవత్సర మాఘం బహుళ నవమి, గురువారం అనగా ది.3-3-2016 ఉదయం 7గం॥ల 25 నిలకు పూజ్య శ్రీ మాతాజీ వారు గుండుగొలను శాఖలో నిర్మింపబడిన ఆశ్రమంలోశ్రీ గురుదేవుల చిత్ర పట చర ప్రతిష్ఠ చేశారు. అనంతరం శ్రీ విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, కలశ స్థాపన జరిగాయి. ఉదయం 11 గం॥లకు శ్రీ సద్గురుదేవుల పాదపూజ జరిగింది. ఉదయం 11 గం॥లనుండి ది. 04.03.2016 శుక్రవారం. శ్రీ గురుదశమి -11గం॥ల వరకు శ్రీహనుమాన్ చాలీసా పారాయణ (ఏకాహం) జరిగింది. ఆ రోజు శ్రీగురుదశమి కావటంతో సామూహిక శ్రీసద్గురు పూజలు జరిగాయి. ఈ రెండు రోజులు భక్త సమారాధన జరిగింది. వివిధ ప్రాంతాల నుండి ఎంతో మంది భక్తులు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొని మహాప్రసాదాన్ని స్వీకరించారు. ఈ రెండు రోజులలో ఏర్పాటు చేసిన సత్సంగ సమావేశాలలో శ్రీ మాతాజీ వారు, ఆశ్రమం నుండి వచ్చిన గురు సోదరులు శ్రీ పరాశర ప్రసాద్ , శ్రీ అకోక్ వర్మ ప్రసాద్, జపమాల ప్రసాద, శ్రీ తారక పరబ్రహ్మ ప్రసాద్ గార్లు ప్రసంగించారు.



శ్రీమాతాజీ వారు ఈ సత్సంగ సమావేశాలలో ప్రసంగిస్తూ, "శ్రీగురుదేవుల లీల అనూహ్యం. శంఖు స్థాపన చేసిన సంవత్సరంలోపునే గుండుగొలను ఆశ్రమ శాఖలో భవ్యమైన మందిర భవనం ఏర్పడింది. ఆశ్రమ ప్రవేశం చేసి శ్రీగురుదేవుల పాదపూజ చేసికొన్నాం.

గుండుగొలను గ్రామానికి ఎంతో చరిత్ర ఉంది. ఇక్కడ శ్రీ బాబూజీ మహరాజ్ వారు ఎన్నో దేవీ నవరాత్రి ఉత్సవాలు చేశారు. అమ్మ ప్రేమమయి. అమ్మలో ఉన్న బ్రహ్మామృతాన్ని మనకు అందించింది ఎవరు?శ్రీబాబూజీ

మహరాజ్ వారు. "ఎవరైతే సమర్థులైన గురుపాదాన్ని ఆశ్రయిస్తారో వారికి ఇహంలోను, పరంలోను ఏ లోటూ రాదు. ఎవరి ధర్మాన్ని వారు నిర్వర్తిస్తూ, అందులోని పరమార్థాన్ని గుర్తించి, చక్కటి సాంప్రదాయాన్ని నెలకొల్పుతారో, వారి కుటుంబ సభ్యులుకూడా వారిని అనుసరిస్తారు" అన్నారు.

మనం ప్రపంచంలోని విషయాలకి లోబడి, అమూల్యమైన మానవజన్మను వృధా చేసికొంటున్నాం.

కృష్ణుని మురళీగానానికి యమున,గోవులు, బృందావనం పరిసరాలన్నీ పులకించిపోయేవి. అలాగే గుండుగొలనులో స్వామివారి గొంతు వినిపించగానే అందరూ వెంటనే తమ తమ పనులన్నీ విడిచి, శ్రీబాబు ఉన్న చోటుకు చేరుకొనేవారు. సర్వ వ్యాపకుడైన భగవంతుడు అవతారాన్ని ధరించి మనముందుకు శ్రీ బాబు రూపంలో వచ్చారు. మానవునిలో రూపం, గుణం, నామం - ఈ మూడూ ఉంటాయి. అవతారమూర్తులలో నాల్గవదైన 'లీల' ఉంటుంది. వారి సాన్నిధ్యంలో, "ఇంకా కొంచెం సేపు ఉంటే బాగుంటుంది", "కాలం ఆగిపోతే బాగుంటుంది" అని అనిపిస్తుంది. అదే వారి లీల. భక్తుడైనవాడు దేవుని రూపంలోను, నామంలోను,ఆయన కళ్యాణ గుణములలోను భగవంతుని సేవించి ఆనందిస్తూనే ఉంటాడు.

శ్రీగురుదేవునిపై భక్తి విశ్వాసాలు కలిగి ఈ దేహం తాను కాదని తెలిసికొని సదా బ్రహ్మాకార వృత్తిలో ఉండటమే జీవన్ముక్త స్థితి. దానికి కావల్సింది ఆవేదన, అకంళకమైన భక్తి. భక్తులను హెచ్చరిక చేస్తూ శ్రీమాతాజీ, " ఈ క్షణమే నీది. అవాంతరాలను దాటి ముందుకు సాగిపో. ఈ కదిలేవన్నీ నిజం కావు.కదలనిది ఒకటి ఉంది. అదే అన్నిటినీ కదిలిస్తోంది అని గ్రహించు. ఈ దేహం కొడి కట్టే దీపంలాంటిది. ఇది ఎప్పుడు పడిపోతుందో తెలియదు. ఈ దేహం పడిపోయేలోగా గురుదేవులను సాధన చేసి నీ గమ్యస్థానాన్ని చేరుకో. మనలను కదిలిస్తూ, ఆడిస్తూ, పాడిస్తూ, వేడుక చూస్తూ వేడుక చూసేవాడు, మనలను ముక్తి పథానికి చేర్చే వాడు శ్రీ గురుదేవులే! కాబట్టి శ్రీగురుదేవుల పాదాలను గట్టిగా పట్టుకో. ఆ గురుదేవుల నీడలో ఉన్న మనకి ఏ విధమైన భయం లేదు. వారి బోధలను చక్కగా విచారణచేసి నిజ తత్త్వాన్ని గ్రహించి మన జీవితాలను పునీతం చేసుకొందాం.శ్రీ గురుదేవులు మనలో ఉన్న భక్తిని ఇంకా పెంపొందింపజేస్తూ, అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యాలను, ఆత్మ జ్ఞానాన్ని ప్రసాదించెదరుగాక ! సుఖీభవ!"

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

ఏప్రిల్ 2016

02 శని : శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ

06 బుధ : మాస శివరాత్రి., పావులూరు శాఖలో ఏకాహం

07 గురు : అమావాస్య

08 శుక్ర : శ్రీ దుర్ముఖి నామ సంవత్సర ఉగాది ; ఉదయం 11గం.లకు పంచాంగ శ్రవణం; శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

08 శుక్రవారం నుండి 14 గురువారం వరకు మౌన ధ్యాన సప్తాహం

15 శుక్ర శ్రీ రామ నవమి; ఉదయం 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ, 11గం.లకు శ్రీసీతారాముల సామూహిక కళ్యాణాలు, భక్తసమారాధన.

22 శుక్ర : చైత్ర పౌర్ణమి, శ్రీసద్గురుపాదపూజ.

మే 2016

02 సోమ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ

05 గురు : మాసశివరాత్రి , పావులూరు శాఖలో ఏకాహం

06 శని : అమావాస్య

09 సోమ : అక్షయ తృతీయ - శ్రీసద్గురుపాదపూజ.

11 బుధ : శ్రీశంకరాచార్య జయంతి, శ్రీసద్గురు ఏక వింశతి వార్షిక ప్రతిష్ఠా మహోత్సవము శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

21 శని : వైశాఖ పౌర్ణమి, శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

26 గురు : వైశాఖ బహుళ పంచమి- శ్రీమహాకాళికా పరమేశ్వరీ సహిత రామలింగేశ్వరస్వామివారల ప్రతిష్ఠా మహోత్సవము, లీలా కళ్యాణము.

31 మంగ : శ్రీగురుదశమి- హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

'సద్గురుమూర్తి సమాశ్రయం ఎలా కలుగుతుంది? సద్గురు మూర్తిని సాధకుడు గుర్తించ గలుగుతాడా?' అన్న ప్రశ్నలకు సమాధానంగా శ్రీగురుదేవులు అందించిన దివ్యసందేశం సాధకులు అందరికీ పరమ శ్రేయస్సు అనే సౌధాన్ని అవరోహణ చేయటానికి తోడ్పడుతుంది.



ప్రాపంచిక సుఖాలకు, భోగాలకు అలవాటు పడిన మానవులు సద్గురు సమాశ్రయం పొందాలనే చింతన చేయరు. కాని ప్రతివారు భగవంతుడు ఉన్నాడని విశ్వసించక మానరు. కనీసం వారి జీవన విధానంలో ఏదైనా దుస్సంఘటన దానికి దోహదం చేయవచ్చు. అయితే మానవుడు భగవంతుడిని పూజిస్తాడు. భజనలో పాల్గొంటాడు. అనేక క్రతువులు నిర్వహిస్తాడు. వాటికి తగిన ఫలితాన్ని పొందుతాడు సందేహం లేదు. కాని మృత్యువును జయించలేడు.

జన్మజన్మల నుంచి ఆర్జించిన పుణ్యం రాశీభూతమై భగవానుని కరుణకు పాత్రుడై ఆ జీవుడిని ఉద్ధరించటానికి ఒక ఉపాధిలో ప్రవేశపెట్టి గురుమూర్తిగా అవతరించి, సద్గురుమూర్తి సమాశ్రయాన్ని ప్రసాదిస్తాడు.

గురు సంప్రదాయంలో లేనివారికి భక్తి బీజదశలోనే వుండిపోతుంది. సాధకునిలో కలిగిన శుభేచ్ఛ గురుసన్నిధికి చేరుస్తుంది. ప్రాపంచిక మోహంలోపడి అంధకారంలో జీవించే మానవులను ఉద్ధరించటానికి గురుపరబ్రహ్మ బోధని అందజేస్తాడు.

గురుసంప్రదాయంలో లేనివారు గురుబోధను వినటానికి ఇష్టపడరు. పోనీ శ్రవణం చేసినా అది మననానికి రాదు. సాగరంలో పడిన వర్షపు చినుకు వలన ఎంత ప్రయోజనమో ఇదీ అంతే! అయితే గురు సంప్రదాయంలో ఉన్న సాధకుడికి శ్రవణం చేసిన బోధ మననానికి వస్తుంది. మననం చేయగా చేయగా సద్గురుమూర్తి అనుగ్రహం కలిగి సద్విచారణ అనే సూర్యోదయం అవుతుంది. సద్గురుమూర్తి అనుగ్రహం కలగటానికి మూలం సత్సంగం. బోధా శ్రవణం ద్వారా నీ హృదయాకాశంలో

అధిష్ఠించి ఉన్న సద్గురు మూర్తి నిన్ను విచారణకి ప్రేరణ చేస్తారు. విచారణ ద్వారా నీ హృదయ ఆకాశంలో సూర్యోదయం అవుతుంది.

గురుబోధ నీ మనస్సులో ప్రతిధ్వనించాలి. ఆ స్థితి నిన్ను తదాకారాన్ని పొందింపజేస్తుంది. మోక్షం అనేది మనస్సుకే. అది బంధ విముక్తిని పొందినప్పుడే సాధ్యపడుతుంది. అంటే వృత్తి రహితం అవ్వాలన్నమాట. ఒక నదిలో బండరాళ్ళు చిరకాలంగా ఉన్నాయనుకోండి ఏమవుతుంది? పాచిపట్టి మలినమవుతాయి.

అలాగే మనోబుద్ధులు బండరాళ్ళలాగా ఎల్లకాలం విషయాదులతోనే కూడి ఉంటే మలినం అంటుతుంది. దానిని రహితం చేసుకునే శక్తి మానవుడికి ఉన్నదా? సద్గురుమూర్తి సమాశ్రయం పొంది ఆయన అందించిన బోధాశ్రవణం ద్వారా మనో మాలిన్యం తప్పక తొలగి పోతుంది" అన్నారు శ్రీ సద్గురుదేవులు.

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

ఏప్రిల్ 2016

2 శని- శ్రీగురుదశమి - రాత్రి7గం. శ్రీసద్గురుపాదపూజ

8 శుక్ర- దుర్ముఖినామ సంవత్సరాది; ఉ. 11గం. శ్రీసద్గురుపాదపూజ

15 శుక్ర- శ్రీరామనవమి; ఉ. 5గం. శ్రీసద్గురుపాదపూజ; 11గం.లకు శ్రీసీతారాముల కళ్యాణం; పానకం వితరణ.

22 శుక్ర- పూర్ణిమ; రాత్రి7గం. శ్రీసద్గురుపాదపూజ

మే 2016

02 సోమ : శ్రీగురుదశమి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ

11 బుధ : శ్రీశంకరాచార్య జయంతి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ.

21 శని : వైశాఖ పౌర్ణమి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

31 మంగ : శ్రీగురుదశమి- హనుమజ్జయంతి - ఉదయం 10గం.లకు ఆకుపూజ; శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

# వార్తలు

1. జనవరి 22 నుండి 26 వరకు - శ్రీకాళీవనాశ్రమం, హైదరాబాదు శాఖలో జరిగిన వార్షిక సమావేశముల సందర్భంగా ప్రతిరోజు పూజ్యశ్రీ మాతాజీవారి బోధామృతం; శ్రీ రామానుజదాస్‌గారి ప్రవచనం భక్తులకు అందించారు. దీనిలో భాగంగా 22వ తేదీన సామూహిక కుంకుమ పూజలు, 26వ తేదీన సామూహిక సద్గురు పాదపూజలు జరిగినవి.

2. జనవరి 29 నుండి 31వరకు - ప.గో.జిల్లా నిడమర్రు మండలం, అడవికొలను గ్రామంలో పూజ్యశ్రీ మాతాజీవారి సత్సంగసమావేశాలు జరిగాయి.

3. ఫిబ్రవరి 3 నుండి 5 వరకు - గుంటూరు జిల్లా, తెనాలి మండలం, కోపల్లె గుడివాడ గ్రామంలో నిర్వహించిన గీతోపన్యాసములలో శ్రీ మాతాజీవారి ప్రవచనములు జరిగినవి.

4. ఫిబ్రవరి 14 నుండి 18 వరకు శ్రీకాళీవన ఆశ్రమం పెదనింద్రకొలను శాఖలో శ్రీసద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠ ద్వాదశవార్షికోత్సవంలో పూజ్యశ్రీ మాతాజీ వారి ప్రవచనములు; శ్రీరామానుజదాస్, శ్రీ జపమాలా ప్రసాద వార్ల ప్రవచనములు జరిగినవి. 14వ తేదీన ఆదిత్య హృదయ పారాయణ, సామూహిక సూర్య (రథసప్తమి) పూజలు, 15వ తేదీన శ్రీసద్గురుదేవుల తెప్పోత్సవం, 16వ తేదీన సామూహిక కుంకుమ పూజలు, 18వ తేదీన సామూహిక గురుపూజలు, హోమము, మహాకుంభాభిషేకము, వైభవంగా జరిగినవి.

6. ఫిబ్రవరి 16 వతేదీ రాత్రి గుంటూరు పట్టణంలోని కీ.శే. బచ్చు పాండు రంగ శ్రీశైలరావుగారి కుమారులు రామ్‌ప్రసాద్, కృష్ణప్రసాద్‌లు నిర్మించిన నూతన భవన గృహప్రవేశము, శ్రీసద్గురుపాదపూజ కార్యక్రమాలలో శ్రీ మాతాజీ పాల్గొన్నారు.

7. ఫిబ్రవరి 20 - గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు మండలం, పాతమల్లాయ పాలెంలో జరిగిన సత్సంగ సమావేశములో శ్రీ మాతాజీ తమ అనుగ్రహ భాషణ భక్తులకు ప్రసాదించారు.

8. ఫిబ్రహవరి 22 - మాఘపూర్ణిమ (గురుపూర్ణిమ) ఉదయం ప్రాతఃకాల పూజ అనంతరం శ్రీ మాతాజీ హైదరాబాద్ శాఖకు చేరుకుని సాయంకాలం శ్రీ సద్గురుపాదపూజ, సత్సంగం నిర్వహించారు.

9. ఫిబ్రవరి 23 - సికింద్రాబాదు మెట్టుగూడలో జరిగిన శ్రీ సనాతన బ్రహ్మజ్ఞాన మహాసభలలో శ్రీ మాతాజీవారు ప్రవచించారు.

10. ఫిబ్రవరి 25 - కృష్ణాజిల్లా, పెదపులిపాక గ్రామంలో పూజ్యశ్రీ వాసుదేవానంద గిరి స్వామివారిచే నిర్మింపబడిన శ్రీవిద్యాపీఠములో శ్రీ విజయ రాజరాజేశ్వరీదేవి ప్రతిష్ఠా, మహాకుంభాభిషేక కార్యక్రమంలో శ్రీ మాతాజీ పాల్గొన్నారు.

11. ఫిబ్రవరి 27 - విజయనగరం జిల్లా, రామభద్రాపురం అగ్రహారంలో 108 కుండములలో హోమము సహితంగా శ్రీ రామానంద స్వామి వారి 108వ రోజు ఆరాధన కార్యక్రమము శ్రీ సాయినాన్నగారి ఆధ్వర్యంలో శ్రీ ఉమావీరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణములో జరిగినది. ఆ సందర్భంగా శ్రీమాతాజీవారు తమ అనుగ్రహ భాషణను అందించారు.

12. ఫిబ్రవరి 28 - విజయనగరం జిల్లా, రామభద్రాపురం అగ్రహారం సమీపంలోని రంగరాయపురం శివాలయ ప్రాంగణంలో జరిగిన సత్సంగ సమావేశములో శ్రీ మాతాజీ తమ దివ్యబోధను అందించారు.

13. మార్చి 3 - ప.గో.జిల్లా, భీమడోలుమండలం, గురుకొలను (గుండుగొలను) గ్రామంలో, శ్రీకాళీవనాశ్రమం, అధిష్ఠాన మందిరం నుండి అఖండ దీపమును పూజించి, తె॥జా 4గం. బయలుదేరి, 6గం. శ్రీసద్గురుదేవుల ఊరేగింపులో చేరుకుని, 7.25ని॥లకు ఆశ్రమశాఖ ప్రవేశము, శ్రీసద్గురుదేవుల చిత్రపట చర ప్రతిష్ఠ, అఖండ దీప స్థాపన, పూజాదికములు శ్రీమాతాజీవారు నిర్వహించారు. అనంతరం వాస్తుపూజ, శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన జరిగినది. సా॥ సత్సంగ సమావేశము జరిగినది. మార్చి 4వ తేదీన సత్సంగం, సద్గురుపాదపూజ, భక్తసమారాధన జరిగినవి. (వివరములకు 19వ పేజీలో చూడండి.)

14. మార్చి 7 మహాశివరాత్రి - శ్రీకాళీవనాశ్రమం నంబూరులో, బృందావనంలో తె.జా 3గం.లకు శ్రీసద్గురుదేవులకు నమకచమకాలతో మహాభిషేకము, అనంతరం శ్రీసద్గురుపాదపూజ, మధ్యాహ్నం12గం. శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి పంచామృతాలు, నవరసాలు అభిషేకము, సహస్రఘటాభిషేకము, లక్షబిల్వార్చన అత్యంత వైభవంగా జరిగినవి. అనంతరం భక్తసమారాధన, సాయంత్రం 6.30ని॥ శ్రీ ఉమారామలింగేశ్వర సామూహిక లీలా కళ్యాణము, నగరోత్సవం జరిగినాయి.

15. మార్చి 21 - కృష్ణా జిల్లా, గుడ్లవల్లేరు మండలం, పెంజెండ్ర గ్రామంలో శ్రీవేణుగోపాల స్వామివారి దేవస్థానంలో శ్రీమాతాజీ తమ అమృతబోధను వర్షించారు.

17. మార్చి 23 - తెనాలి, అష్టలక్ష్మీ అమ్మవారి జయంతి ఉత్సవములలో పూజ్యశ్రీ మాతాజీవారు తమ దివ్య ప్రవచనం చేశారు.

18. మార్చి 24 -25 - బెంగుళూరులో శ్రీ కన్నాజి సుబ్బారావుగారిచే నూతనంగా నిర్మించిన గృహప్రవేశం, వాస్తుపూజ, గణపతి పూజ అనంతరం శ్రీసద్గురుపాదపూజ పూజ్యశ్రీ మాతాజీ నిర్వహించారు.

19. మార్చి 26-27 - విశాఖపట్నంలో శ్రీ బంకి గణేష్‌గారిచే నూతనంగా నిర్మించిన గృహప్రవేశం, వాస్తుపూజ, గణపతి పూజ అనంతరం శ్రీసద్గురు పాదపూజ పూజ్యశ్రీ మాతాజీ నిర్వహించారు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

ఏప్రియల్ 2016

2 శనివారం శ్రీగురుదశమి; సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

8 శుక్రవారం ఉగాది. సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

15 శుక్ర : శ్రీరామనవమి,సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

22 శుక్ర : చైత్ర పూర్ణిమ; సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

మే 2016

02 సోమ : శ్రీగురుదశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

11 బుధ : శ్రీశంకరాచార్య జయంతి, సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

21 శని : వైశాఖ పౌర్ణమి, సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

31 మంగ : శ్రీగురుదశమి- హనుమజ్జయంతి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

# బృందావనమది అందరిదీ

- పెనుమాక నాగేశ్వరరావు

బృందావనమది అందరిదీ మనందరికీ
ప్రేమను పంచే మందిరమే అది ॥బృందావన॥

సద్గురుమూర్తి కొలువైవున్న మందిరమది
మనందరి మదిలో మెదిలే సుందర రూపమది ॥బృందావన॥

భోగిపండుగ వైభోగమైనా, అరాధనోత్సవ ఆనందమైనా
అర్చనలైనా, హారతులైనా, గానములైనా, నృత్యములైనా ॥బృందావన॥

ప్రార్థనలైనా, ప్రవచనములైనా
ఆనందాల కూడలదీ, ఆశీర్వదించే లోగిలదీ ॥బృందావన॥

కైవల్యానికి వాకిలదీ, ఇహపరాల వారధదీ
ముక్కోటి దేవతలు కొలవైన కోవెలదీ ॥బృందావన॥



# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

(గత సంచిక తరువాయి)

నిస్తేజంగా ఉన్నదంతా. ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ నందబాలుడు వచ్చిన దేవతలతో 'మీరిప్పుడు మీ గాన విద్యనంతా ప్రదర్శించి, సర్వ ప్రకృతిని చైతన్యవంతం చేయండి' అన్నాడు.

స్వర లయ రాగ తాళ బద్ధంగా అమ్మ తమకు నేర్పిన గాన విద్యనంతా ప్రదర్శిస్తూ వారిద్దరూ పరమోత్సాహంగా గానం చేయసాగారు. వారలా పరవశులై గానరస వాహినిలో నిలిచిపోతూ తమ శక్తినంతటినీ ప్రదర్శించ సాగారు. చిత్రం! ఎక్కడా కదలికల్లేవే! చరాచర జగత్తంతా జడప్రాయంగా ఉన్నది. మనస్సులో వాళ్ళ అమ్మకి అనేకానేక వందనాలు అర్పించారు! కానీ ఫలితం లేకపోయింది. తమలోని అహంకారాన్ని తొలగించటానికే అమ్మ యిలా చేసిందని అర్థమైంది.



తిరుగులేని అనుభవం వారికి చక్కటి గుణపాఠం నేర్వగా వెంటనే గోపాలదేవుని పాదాలనంటి 'దేవి ఆజ్ఞమేరకు మేమిలా సాహసించి వచ్చాం. మేము అధికులమనే గర్వంతో మీ యెడల తప్పుచేసినందుకు మమ్మల్ని క్షమించండి' అని వేడుకున్నారు.

గోపాలదేవుని పెదవులపై చిరునవ్వు వెలసింది. 'మిమ్మల్ని చూడగానే అమ్మ మనస్సు తెలుసుకున్నానులెండి' అన్నాడు. వెంటనే వేణువుని పెదవులపై నిలిపి మధురంగా మ్రోగించసాగాడు. ఆ క్షణానే సకల సృష్టి చైతన్యవంతం అయింది.

పైనుండి యిదంతా చూస్తున్న బ్రహ్మదేవుడు "బృందావనంలో మెల్లమెల్లగా పిల్లనగ్రోవి మోగిస్తున్నవాడు, వేదవాక్కులలో వెలుగుతున్న వాడు, ఇంద్రుని యాగాలను పాడుచేసే రాక్షసులను సంహరించేవాడు, గోపీజన మనో వల్లభుడు అయిన వానిని ఓనాలుకా! పొగడుతూ వుండవే" అన్నాడు."గర్వితులైన వారిద్దరి అహంకారం అణిగించాలనుకున్న నా కార్యాన్ని నెరవేర్చినవాడు గోపాలదేవుడే కదా!" అన్నది సరస్వతీమ తల్లి.

# శ్రీవిజయేశ్వరానంద ప్రసాద్‌గారికి నివాళులు

శ్రీ బాబూజీ మహరాజ్ వారిచే "శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్" అనే అన్వర్థ నామం పొందిన శ్రీ గూడూరి వెంకటరత్నంగారు ది. 13-3-2016 ఉదయం 7గం॥12నిలకు గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 87 సంవత్సరములు. వీరికి ఇద్దరు కుమారులు, ఇరువురు కుమార్తెలు కలరు. వీరు శ్రీ బాబూజీ మహరాజ్ వారి ప్రియతమ శిష్యులు. బహుముఖ ప్రజ్ఞాశాలి. వీరు సంస్కృత, ఆంగ్ల, తెలుగు భాషలలో మంచి పావీణ్యం ఉన్నవారు. కవులు. మంచి వక్త. సంగీతంలో ప్రవేశం వున్నవారు. ఎన్నో భక్తి పూర్వక కీర్తనలు వ్రాసి స్వయంగా పాడి



శ్రీగురుదేవులను అలరించేవారు. వీరు శ్రీ కాళికా పరమేశ్వరి రామలింగేశ్వర స్వామి వారల మేలుకొలుపు, పవళింపు సేవలపైన పాటలు రచించారు. ఆశ్రమానికి వీరు ఎనలేని సేవలను అందించారు. గురుకులంలో కొంతకాలం కరెస్పాండెంట్‌గా ఉన్నారు. సమర్థ సద్గురు తెలుగు మాస పత్రిక, త్రైమాసిక ఆంగ్ల పత్రికలకు సంపాదక వర్గంలో ఉండి ఎన్నో ఆధ్యాత్మిక రచనలు చేశారు. శ్రీ బాబూజీ వారికి ప్రీతి కలిగించే విధంగా నవరాత్రి ఉత్సవాలలో పరమ భక్తుల చరిత్రలకు నాటక రూపం ఇచ్చి ఆశ్రమ బాలబాలికలచే వేయించి శ్రీ గురుదేవుల మన్ననలను పొందేవారు. వాటిలో - భక్త ప్రహ్లాద, భక్త సిరియాళ, జ్ఞాన దేవ, సమర్థ రామదాస్, పరమానందశిష్యులు ముఖ్యంగా పేర్కొన తగ్గవి.

ది.24.05.1981 న శ్రీ రామలింగేశ్వరస్వామి, శ్రీకాళికా పరమేశ్వరి నవ గ్రహమూర్తుల దివ్య ప్రతిష్ఠ శ్రీ బాబూజీ మహరాజ్ వారు చేసిన రోజునుండి వీరు, వీరి సతీమణి శ్రీకళ్యాణిగారు ఆ

దేవతామూర్తులను ఎంతో భక్తి శ్రద్ధలతో సేవలు చేస్తూ వచ్చారు.

నవరాత్రి మహోత్సవాలలో శ్రీ బాబూజీ మహరాజ్ వారి చెంత ఉండి అన్ని కార్యక్రమాలలో పాల్గొనేవారు. శ్రీబాబూజీ మహరాజ్ వారు శ్రీ వెంకటరత్నంగారిని, శ్రీ తారక పరబ్రహ్మ శాస్త్రిగారిని తమ ప్రక్కన నిలబెట్టి తమ బోధామృతాన్ని భక్తులకు అందించేవారు. వెంటనే శ్రీ వెంకటరత్నంగారు ఇంటికి రావటం, శ్రీ బాబూజీవారి బోధామృతసారాన్ని వ్రాసి పత్రికకు అందించటం, ఆ మర్నాడు శ్రీబాబూజీ మహరాజ్ వారి బోధ పత్రికలలో పడటం జరిగేది. శ్రీబాబూజీ పత్రికలలో ప్రకటితమైన అంశాలలోని లోతైన తత్త్వ రహస్యాలను భక్తులకు విశదపరిచేవారు. పత్రికలలో ప్రచురింపబడిన వాటిని 'గురువాణి' పేరిట తెలుగులోను, **SAMARDHA SADGURU** పేరిట ఇంగ్లీషులోను ప్రచురించారు.

శ్రీ వెంకటరత్నంగారు ముఖ్యంగా శ్రీ సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర ఒకటవ భాగం, రెండవ భాగం రచించారు. భక్తులందరూ వాటిని పారాయణ గ్రంథాలుగా చేసికొని సద్గురు కృపకు పాత్రులవుతున్నారు.

ఈ సందర్భంగా శ్రీ మాతాజీ వారు, " విశ్వాత్మ స్వరూపులైన శ్రీ గురుదేవుల చరిత్ర వ్రాయటం అంత తేలిక కాదు. అయినా పరమ కృపా సముద్రులైన శ్రీ గురుదేవులు తమను అనన్య భక్తితో ఆశ్రయించిన భక్తులకు తమ ప్రేమ తత్త్వాన్ని అందించేటందుకు శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్ గారిని కరుణించి వారి లేఖినిలో ప్రవేశించి తమ్ము తాము అక్షరములలో పొదిగించుకొని ఈ పవిత్ర గ్రంథాలను వ్రాయించుకున్నారు. ఇట్టి దివ్య అవకాశమును భక్తులందరూ వినియోగించుకుని శ్రీ సమర్థ సద్గురు దేవుని దివ్య చరిత్రను పారాయణ చేసి తరింతురు గాక!

శ్రీ విజయాశ్వరానంద ప్రసాద్ గారు స్వస్వరూపలయం పొందిన సందర్భంగా, శ్రీగురుదేవులు వారి కుటుంబ సభ్యులందరికీ ధైర్య, స్థైర్యములను,మన శ్శాంతిని అఖండ సాధనా సంపత్తిని, అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యములను, ఆత్మ జ్ఞానమును ప్రసాదించెదరు గాక!" అన్నారు

శ్రీ వెంకటరత్నం గారికి నివాళులు అర్పిస్తూ, వారి కుటుంబసభ్యులకు. ధైర్య, స్థైర్యాలని, మనశ్శాంతిని శ్రీగురుదేవులు ప్రసాదించెదరు గాక! అని ప్రార్థిస్తున్నాము.

(గత సంచిక తరువాయి) 

# గీతాధ్యయనమ్

- రమణ ప్రసాద్

## క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగము

భగవానుడు భక్తి షట్కాన్ని వివరించి, జ్ఞానషట్కాన్ని క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగంలో ప్రారంభిస్తున్నాడు. క్షేత్రమనగా శరీరము. క్షేత్రజ్ఞుడనగా ఆత్మ. జీవుడు వాస్తవానికి క్షేత్రజ్ఞుడే. క్షేత్రం పంచభూతాత్మకమైనది. నశ్వరమైనది. క్షేత్రమునెరిగినవాడు శాశ్వతుడు. అర్జునుడు ఇలా ప్రశ్నించాడు



ప్రకృతిం పురుషం చైవ। క్షేత్రం క్షేత్రజ్ఞ మేవ చ।
ఏత ద్వేదితు మిచ్ఛామి। జ్ఞానం జ్ఞేయం చ కేశవ!॥ 1

'ఓ కృష్ణా! ప్రకృతి, పురుషుడు, క్షేత్రము, క్షేత్రజ్ఞుడు, జ్ఞానము, జ్ఞేయము వీటిగురించి విశదంగా తెలుసుకొనగోరుతున్నాను.'

భగవానుడు 'అర్జునా! ఈ శరీరము క్షేత్రము. దానిని తెలిసికొన్నవాడు క్షేత్రజ్ఞుడు. క్షేత్ర క్షేత్రజ్ఞముల జ్ఞానమే నిజమైన జ్ఞానము. పంచమహా భూతాలు, అహంకారము, బుద్ధి, మూలప్రకృతి, దశేంద్రియాలు, మనస్సు, పంచేంద్రియాలు, విషయాలు, కోరికలు, ద్వేషం, సుఖం, దుఃఖం, దేహేంద్రియాల సమూహము, తెలివి, ధైర్యం ఈ సముదాయం వికార వంతమైన క్షేత్రం.

అమానిత్వ మదంభిత్వం। అహింసా క్షాంతి రార్జవమ్।
ఆచార్యోపాసనం శౌచం। స్థైర్య మాత్మవినిగ్రహః॥ 8

తనను తాను పొగుడుకోకపోవటం, కపటం లేకపోవటం, అహింస, సహనం, సరళత్వం, సద్గురుసేవ, శరీరాన్ని మనస్సును శుద్ధం గా ఉంచుకోవటం, ఇంకా స్థిరత్వం, ఆత్మనిగ్రహం, ఇంద్రియాలపై విరక్తి, అహంకారం లేకపోవటం, పుట్టుక, చావు, ముసలితనం, రోగాలు వల్ల కలిగే దోషాన్ని గుర్తించటం, దేనిమీద ఆసక్తి లేకపోవటం, దారాపుత్రులు, ఇళ్ళువాకిళ్ళు పట్ల వ్యామోహం లేకపోవటం, శుభాశుభాలలో సమభావం, నా పట్ల అనన్యభక్తిని కలిగి ఉండటం, ఆత్మజ్ఞానంలో నిమగ్నమై వుండటం, ఏకాంత ప్రదేశంలో ఉండటం, ఆత్మజ్ఞానంలో ఉండటం ఇదంతా జ్ఞానం.

దీనికి విరుద్ధమైనది అజ్ఞానం. ఇక పరబ్రహ్మం గురించి చెబుతాను.

సర్వతః పాణిపాదం తత్ । సర్వతోఽ క్షి శిరోముఖమ్।
సర్వతః శ్రుతి మల్లోకే । సర్వమావృత్య తిష్ఠతి ॥ 14

ఆ పరబ్రహ్మం అంతటా చేతులూ, కాళ్ళూ, తలలూ, ముఖాలు, చెవులూ కలిగి సమస్త జగత్తును ఆవరించి ఉంటుంది. ఆ బ్రహ్మం అన్ని ఇంద్రియాలను గుణాలను ప్రకాశింపజేస్తూ దేనినీ అంటకపోయినా, గుణాలు లేనిదైనా గుణాలు అనుభవిస్తూ ఉంటుంది. కదలదు. కదులుతుంది. అది సూక్ష్మం. ఎంతో దూరంలో ఉంది. ఎంతో దగ్గరలోనూ ఉంది.

జ్యోతిషామపి తజ్జ్యోతిః । తమసః పరముచ్యతే ।
జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం। హృది సర్వస్య విష్ఠితమ్ ॥ 18

అది జ్యోతులన్నిటిని ప్రకాశింపజేస్తుంది. అది జ్ఞానంతో తెలుసుకోగలిగినదీ, జ్ఞానంతో పొందదగినదీ అయి అందరి హృదయాలలో అధిష్టించి ఉన్నది.

ప్రకృతి పురుషుడు అనాది. ఇచ్ఛా ద్వేషాలు, వికార గుణాలు ప్రకృతి నుండే పుడుతున్నాయి. ధ్యాన యోగం ద్వారా కొంతమంది, జ్ఞాన కర్మయోగాల వల్ల కొంతమంది పరమాత్మను తమలో దర్శిస్తున్నారు.

సమం సర్వేషు భూతేషు । తిష్ఠంతం పరమేశ్వరమ్ ।
వినశ్య త్స్వవినశ్యంతం । యః పశ్యతి స పశ్యతి ॥ 28

శరీరాలు నశిస్తాయి. కాని తాను నశించకుండా సమస్త ప్రాణులలో ఉన్న పరమాత్మను చూసేవాడే నిజమైన జ్ఞాని. పరమాత్మ శాశ్వతుడు, పుట్టుకలేనివాడు, గుణరహితుడు. అతడు దేనికీ కర్తకాదు. కర్మఫలం అతనికి అంటదు.

యథా సర్వగతం సౌక్ష్మ్యాత్ । ఆకాశం నోపలిప్యతే ।
సర్వత్రావస్థితో దేహే ।తథాఽఽ త్మా నోపలిప్యతే ॥ 33

అంతటా వ్యాపించి ఉన్న ఆకాశం దేనికీ అంటనట్లే శరీరం అంతా ఉన్నా ఆత్మ కల్మషం కాదు.

సూర్యుడు సమస్త లోకాన్ని ప్రకాశింపజేస్తున్నట్లు క్షేత్రజ్ఞుడైన పరమాత్మ క్షేత్రమంతటినీ ప్రకాశింపజేస్తున్నాడని తెలుసుకొన్నవారు పరమ పదం పొందుతారు.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# అగస్త్య మహర్షి

- రమణ ప్రసాద్

దేవతలు,“మునినాథా! ఈ సాగరము అనేక జంతువులకు ఆశ్రయమిస్తున్నది. కాబట్టి తిరిగి పూరింపుమ”ని వేడుకున్నారు. అగస్త్యుడు,“దేవతలారా! ఈ సముద్ర జలం నాలో జీర్ణమైపోయింది. నేను మూత్రద్వారము నుండి పూరిస్తాన”ని చెప్పి పూరించాడు.



ఆ కారణంచేత ఆ రోజు నుండి సముద్ర జలం ఉప్పగా మారింది.

అగస్త్యుడు దండకారణ్యంలో ఒక ఆశ్రమం నిర్మించుకుని తపస్సు చేసుకుంటున్న సమయంలో శ్రీరాముడు అరణ్యవాసం చేస్తూ, సీతా లక్ష్మణ సమేతంగా అగస్త్యముని వద్దకు వచ్చాడు. అగస్త్యుడు వారిని ఆదరించి అతిథి సత్కారాలను చేసి శ్రీరామునికి ఒక దివ్య ఖడ్గము, వైష్ణవమయమైన విల్లు, అమోఘ బాణములు కల అమ్ములపొదిని ఇచ్చి, “మీరు గౌతమీ నదీ తీరాన ఉన్న పంచవటిలో ఆశ్రమం నిర్మించుకొని అక్కడ నివాసం చేయండి” అని చెప్పగా వారు అగస్త్యుని వద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోయారు.

తరువాత కొంత కాలానికి శ్రీరామ రావణుల యుద్ధంలో శ్రీరాముడు రావణుని తీవ్రబాణాలచే బాధింపబడి భావి కర్తవ్యము తోచక విచారిస్తున్న సమయంలో అగస్త్యుడు అక్కడికి వచ్చాడు. శ్రీరామునికి జయప్రదమైనది, అఖిలైశ్వర్య మంగళకరమైన “ఆదిత్య హృదయము” అనే మహాస్తవాన్ని ఉపదేశించి, శ్రీరాముని ఉత్సాహపరిచి, “ఈ ఆదిత్య హృదయ స్తవ ప్రభావం వలన నువ్వు రావణుని వధించటం నిశ్చయము. విజయం నిన్నే వరిస్తుంది” అని దీవించి వెళ్ళిపోయాడు.

అగస్త్యుడు తారక బ్రహ్మోపదేశము కొరకు అవిముక్త క్షేత్రంలో విశ్వేశ్వరుని సేవిస్తున్న సమయంలో, వింధ్య పర్వతము, మేరు పర్వతముపై అసూయతో పెద్దగా పెరిగి సూర్య చంద్ర నక్షత్రముల గమనానికి అవరోధం కలిగంచటంతో రాత్రింబవళ్ళు ఏర్పడక లోక వ్యవహారములు ఆగిపోయాయి. దేవతలు ఎంత ప్రార్థించినా వింధ్యకు కోపం ఉపశమించ లేదు. అప్పుడు దేవతలు బ్రహ్మతో మొర పెట్టుకోగా, బ్రహ్మ వారిని అగస్త్యుని వద్దకు పంపాడు. వారు భూలోకంలో ఉన్న కాశీ పట్టణానికి వచ్చి అగస్త్యుని

సందర్శించి వారు వచ్చిన కారణం తెలిపారు. అగస్త్యుడు, "నేను దేవతల కార్య నిమిత్తంగా కాశీ విడువవలసి వస్తోంద"ని విచారించి లోపాముద్రా సహితుడై వింధ్య పర్వత ప్రాంతాన్ని సమీపించాడు. అగస్త్యుని దూరం నుంచి చూసి విధ్య పర్వతం గౌరవ సూచకంగా క్రిందికి ఒదిగిపోయింది. లోకోపద్రవం తొలగిపోయింది. వింధ్య పర్వతం అగస్త్య మహర్షికి సాష్టాంగం చేసి, "మహానుభావా! ఈ భృత్యుడేమి చేయవలెనో ఆజ్ఞాపించండి" అని వేడుకొన్నాడు. "పర్వతరాజా! నేను సతీ సమేతంగా దక్షిణాపథానికి తీర్థయాత్ర చేయటానికి వెళ్తున్నాను. మేము తిరిగి వచ్చేదాకా భూమికి సమానంగా ఉండమ"ని ఆదేశించాడు.

అగస్త్యుడు తీర్థయాత్రలు చేస్తూ ఆంధ్రదేశానకి వచ్చి ద్రాక్షారామం చేరి భీమేశ్వరుని ధర్శించి అక్కడ కొంత కాలము ఉండి కొల్లాపురము చేరాడు. అక్కడ లక్ష్మీదేవిని స్తుతించి ఆమెను ప్రసన్నురాలిగా చేసికొన్నాడు. లక్ష్మీదేవి ప్రత్యక్షమై,"ఋషి పుంగవా! నీ స్తుతికి సంతసించాను. నీవు రాగల యిరవైతొమ్మిదవ ద్వాపరంలో వ్యాసుడివై వారణాసిలో వేద శాస్త్ర పురాణ సంహిత, ధర్మ శాస్త్రాలను రచిస్తావు" అని దీవించింది.

పూర్వం హిమగిరిపైన పార్వతీ పరమేశ్వరుల వివాహం జరుగుతుండగా, ఆ కళ్యాణానికి వచ్చిన యక్ష కిన్నెర కింపురుషాదులు బ్రహ్మానందంలో ఓలలాడుతుండగా, ఆ భారానికి భూమి దక్షిణ దిక్కుకు పైకి లేవడంతో ఉత్తరదిక్కు క్రుంగి పోవడం మొదలుపెట్టింది. అప్పుడు పరమేశ్వరుడు అగస్త్యుని పిలిచి," కుంభ సంభవా! ఈ ఉపద్రవంనుండి కాపాడగల సమర్థుడవు నీవే"అని చెప్పాడు. అగస్త్యుడు శిష్య సమేతంగా దక్షిణదిక్కువైపుగా వెళ్ళాడు. అప్పుడు భూమి సమానం అయింది. అగస్త్యుడు ఆ విధంగా చేసి భూభారాన్ని తగ్గించాడు. అగస్త్యమహర్షి లోకోత్తర పురుషుడై జీవితాంతం లోకోద్ధరణ కార్యాలను చేసిన విశ్వ శ్రేయస్కరుడు. మహా భారతంలోశాంతి పర్వంలో ఈయన చేసిన మహాబోధ "అగస్త్య గీత" అనే పేరుతో ప్రసిద్ధి పొందింది. ఆయన ఉపదేశించిన తత్త్వసారము -"శివుడే దాత శివుండె భోక్త ।శివుఁడే చేయును మఖాదిక్రియల్ ।శివుఁడే విశ్వము నే శివుండ ......" అని అద్వైతాద్వైతానుసంధానాన్ని చేశాడు.అగస్త్య మహర్షి నేటికీ భాద్రపదమాసంలో నక్షత్ర రూపంలోఅందరికీ దర్శనం ఇసున్తాడు.

# కారు చీకటిలో కాంతి రేఖ

- పాలూరి కాళీప్రసాద్(U.S.A.)

అది 1990వ సంవత్సరం. తుఫాను గుంటూరు, కృష్ణాజిల్లాలను అతలాకుతలం చేసి, తీరం చేరుతున్న సమయం. నేను బయటి నుండి మా ఇంటివైపుగా నడుస్తున్నాను. అప్పుడికే కరెంట్‌పోయి చిమ్మచీకటి అలుముకుంది. అయినా తెలిసినదారే కనుక అలాగే తడుముకుంటూ వెళ్తున్నాను. సరిగా మా యింటి దగ్గర మలుపు తిరుగుతుండగా ఒక్కసారి పెద్దగా మెరుపుమెరిసింది. తరువాతి అడుగు వేయటానికి ఎత్తిన కాలు ఆ వెలుగులో అక్కడున్న బురదను చూసి, చటుక్కున కాలు వెనక్కు తీసుకుని ప్రక్కనుంచి వెళ్ళాను. అక్కడ ఎంత బురదగా వుందంటే అందులో కాలువేస్తే ఎక్కడో తేలేవాడిని. ఆ చీకట్లో, గాలివానలో నా అరుపులు కూడా ఎవరికీ వినిపించేవికావు. సందర్భం గుర్తులేదు కానీ యిలాగే యింకా ఒకటి రెండుసార్లు కూడా జరిగింది.

నేను డిగ్రీలో వుండగా తరచుగా కాలేజీ ఎగ్గొట్టి సినిమాలు చూస్తూ వుండేవాడిని. అలా ఒకరోజు కాలేజీకని బయలుదేరి యివ్వాళ ఏ సినిమాకు వేళదామా అని ఆలోచించుకుంటూ ఉండగా, ఒక్కసారిగా నాకు చాలా ఆవేదన కలిగింది. శ్రీగురుదేవులను మనస్సులోనే యిలా ప్రశ్నించుకున్నాను 'నేను మామూలు బురదలో కాలువేసి పడబోతుంటే అలా వెలుగు చూపించి నన్ను కాలుజారకుండా ఎన్నోసార్లు కాపాడారు కదా, మరి ఇలా క్లాసులు ఎగ్గొట్టి సినిమాలు చూస్తూ జీవితం పాడు చేసుకుంటూ వుంటే ఎప్పుడూ అడ్డుకోరు ఎందుకు?' అని.

వెంటనే నా మనస్సులో నుండే నాకు సమాధానం వినిపించింది. "నేను నిన్ను ఎప్పుడూ బురదలో కాలు వేయకుండా ఆపలేదు, అలాగే నిన్ను బలవంతంగా వెనక్కు లాగలేదు. నేను కేవలం చీకట్లో అక్కడ బురద ఉన్నదని మాత్రమే చూపించాను. బురదలో కాలు వేస్తే కలిగే పరిణామం ఏమిటో నీకు బుద్ధిలో బాగా నాటుకుని ఉంది. కాబట్టి నీ అంతట నీవే కాలు వెనక్కు తీసుకున్నావు. మరి అలాగే నీవు క్లాసులు ఎగ్గొట్టి సినిమాకు వెళ్ళిన ప్రతిసారీ నేను నీకు నీ తప్పును ఏదో ఒక రూపంలో సూచిస్తూనే ఉన్నాను. కానీ ఆ తప్పు వలన కలిగిన పరిణామం

నీ బుద్ధిలో బలంగా నాటుకోని కారణంగా నువ్వు నా సూచనలను పట్టించుకోకుండా నీ తప్పును కొనసాగిస్తూ వచ్చావు" అని.

"నిజంగా దేవుడనేవాడు ఉంటే నా తప్పులను ఎందుకు అడ్డుకోడు?" అని ప్రశ్నించే వారందరూ ఒక్కసారి వారి అంతరాత్మను తరచి చూసుకుంటే భగవంతుడు ఎన్ని విధాలుగా మనకు తప్పులను తెలియజేస్తున్నాడో మనకే తెలుస్తుంది. కానీ మనలోని బలహీనతల కారణంగా మనం ఆ సూచనలను పట్టించుకోకుండా, చివరికి ఆ తప్పుల ఫలితాలను అనుభవించాల్సి వచ్చిన సందర్భంలో భగవంతుని నిందిస్తాం.

గురుదేవుడు (భగవంతుడు) ఒక మార్గదర్శి మాత్రమే. ఆయన చూపించిన మార్గంలో పయనం చేయటం పూర్తిగా మన కర్తవ్యమే. మన పిల్లలను పసివారుగా వున్నప్పుడు వారిని అనుక్షణం కంటికి రెప్పలా చూసుకుంటాం. కానీ వారు కాస్త పెద్దవారు అయ్యాక మనం కేవలం సలహాలనే యిస్తాం కానీ వారిని ప్రతి విషయంలోనూ అడ్డుకోము. ఎందుకంటే వారి తప్పుల నుంచి వారు కూడా నేర్చుకోవాలని భావిస్తాం. కానీ ఎంత పెద్దవారైనా, ఎన్ని తప్పులు చేసినా, వాళ్ళకు దాటలేని అపాయాలు ఎదురైనప్పుడు మనం తప్పకుండా రక్షణకు పరుగుపెడతాం. అలాగే భగవంతుడు కూడా మన తప్పుల నుండి నేర్చుకోవాటనికి మనకు అనేక అవకాశాలు యిస్తాడు. అంతమాత్రం చేత మనం నిజంగా ప్రమాదంలో పడినప్పుడు మాత్రం కేవలం మార్గదర్శనం మాత్రమే చేస్తూ వూరుకోడు తప్పక మనలను రక్షణ చేస్తాడు.

అలాంటి సంఘటనలు నా జీవితంలో ఎన్నో! మచ్చుకకి ఒకటి. న్యూయార్క్‌లో ఒక ఎలక్ట్రానిక్ షాప్‌కి వెళ్ళి, ఎస్కలేటర్ మీద నిల్చుని కూడా, నాకున్న సహజ కుతూహలంతో ప్రక్కకు వంగి క్రింద ఉన్న ఏవో అట్టపెట్టెలమీద పేర్లు చదువుతున్నాను. ఉన్నట్లుండి, ఎవరో నా తలను వెనక్కు లాగినట్లయింది. వెనకాల ఎవరూ లేరు. కానీ ఒక్క క్షణం నా తల అలా వెనక్కు తీయడం ఆలస్యమయితే, ఎస్కలేటర్ ప్రక్కనే వున్న సీలింగ్‌కి నా తల గట్టిగా కొట్టుకుని బుర్ర పగిలి ఉండేది. అదే శ్రీబాబు రక్షణ!!

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## కోటిపల్లి మామ్మగారు

పోతునూరు అక్కయ్య రెండవ అల్లుడు (వల్లీ రమణ భర్త) హనుమత్కాళీ ప్రసాదుకు భద్రాచలంలో మొదట ఉద్యోగం వచ్చి, చేరిన క్రొత్తలోనే ఒక సంఘటన జరిగింది. అప్పుడు శ్రీ బాబు భక్త బృందంతో సహా యాత్రలు చేస్తున్నారు. ఒకరోజు పేపరు చూస్తుంటే, శ్రీ బాబు యాత్రా కార్యక్రమంలో ఆ మరునాడు భద్రాచలం వస్తారని వార్త కనబడింది. తాను ఉద్యోగం చేస్తున్న ఊరికే శ్రీబాబు వస్తున్నారు గనుక ఆయన దర్శనం చేసుకొని ఆయనతో గడపాలి. అంటే మర్నాడు శెలవు పెట్టాలి. క్రొత్తగా చేరిన ఉద్యోగం కదా! మొదట్లోనే శెలవు అడిగితే యివ్వక పోవచ్చు. శెలవు అడిగి, యివ్వక పోయినా వెళ్ళిపోతే, అది నిర్లక్ష్యం చేసినట్లు అవుతుంది. కాని శ్రీబాబు వద్దకు వెళ్ళక తప్పదు.



ఏమైనా కానిమ్మని ప్రసాదు శెలవు పెట్టకుండానే వెళ్ళి శ్రీ బాబు దర్శనం చేసుకున్నాడు. ఆ రోజు శ్రీబాబుతోను, భక్తులతోను గడిపి, మరునాడు ప్రొద్దున ఫ్యాక్టరీకి డ్యూటీకి వెళ్ళాడు. హాజరు పట్టీలో సంతకం పెడదామని వెళ్ళేసరికి, ఆ ముందు రోజున ( తాను హాజరు కాని రోజున) తన పేరుకు ఎదురుగా తన సంతకం చేసి ఉన్నది. అప్పటికి తన బదులు తన సంతకం పెట్టేటంత చనువుగా తనకు తెలిసిన స్నేహితులూ ఎవరూ లేరు. ఆశ్చర్యపడుతూ ఆ రోజు సంతకం చేసి తన గదిలోకి వెడుతుంటే, ఆఫీసరు ఎదురుగా వచ్చి "ప్రసాదూ! నీ కోసమే చూస్తున్నానయ్యా! నీ సీనియరు యింతవరకు పూర్తి చేయలేక వదిలి వేసిన పనిని నీవు నిన్న ఒక్కరోజులో పూర్తి చేశావు. చాలా సంతోషం" అన్నాడు. ప్రసాదుకు పై ప్రాణాలు పైనే పోయాయి. అసలు తాను ఫ్యాక్టరీకే రాలేదు కదా! ఇది తనకు ఉద్వాసన చెప్పటానికి ఉపోద్ఘాతమేమో అనుకున్నాడు. కాని

ఆఫీసరు ఎంతో సంతోషంగా ఉన్నాడు. "నిన్న నువ్వు చేయగా మిగిలిన కాస్త పనీ యీ రోజు పూర్తిచేసెయ్యి" అన్నాడు.

అక్కడేమో తన సంతకం చూసి, తన కళ్లను తానే నమ్మలేక పోయాడు. ఇక్కడ ఆఫీసరు మాట విని, తన చెవులను కూడా తాను నమ్మలేని పరిస్థితి అయింది. తీరా తాను మామూలుగా పని చేసే చోటికి వెళ్లేసరికి, తన సీనియరు "ప్రసాదూ! నిన్న నువ్వు చేసిన పనిని చూసి, మన ఆఫీసరు ఎంతో సంతోషించాడయ్యా! అది నేను చెయ్యలేక పోయానని నన్ను చివాట్లు కూడా పెట్టాడు. మిగిలిన ఆ కాస్త పనీ పూర్తి చెయ్యి బాబూ" అన్నాడు. ప్రసాదుకు ఆశ్చర్యము, ఆనందముతో బాటు దుఃఖం ముంచుకొని వచ్చింది. "నా గురుదేవులు, తమ దర్శనం కోసం నేను వచ్చానని, నాకు మాట రాకుండా, నా వేషం వేసుకొని, నేను పొట్టకూటి కోసం చేసే కూలి పనిని, తాము చేశారా! బాబూ! మీ ఋణం ఎన్ని జన్మలెత్తితే మాత్రం నేను తీర్చుకోగలనా?" అని తన తనువూ మనస్సు కూడా పరవశించిపోతుండగా, తనలోని మార్పులను బయటకు తెలియనీయకుండా అణుచుకొని, పని చేయవలసిన చోటుకు వెళ్ళాడు. "మిగిలినది పూర్తి చేయమన్నారు. కాని నేను అసలు నిన్న ఏ పనీ చేయనేలేదే? అది ఏపనో, ఎంతవరకు అయిందో , యింకా ఏమి చేయవలసి ఉన్నదో, నాకేమీ తెలియదే? ఏమీ తెలియనట్లు బయట పడితే ప్రమాదం.

ఇంతవరకు నాకేమీ తెలియకుండానే యింత చేసిన శ్రీ బాబు మిగతాది కూడా నా చేత తామే చేయించుకుంటారులే" అని ధైర్యం తెచ్చుకుని, ఓం బాబూ! ఓం బాబూ!" అంటూ మిషను రిపేరు కోసం ఎక్కాడు. తాను ఏం చేస్తున్నాడో తనకే తెలియకుండా ప్రసాదు శ్రీ బాబు స్మరణలో మునిగిపోవటము, ఆ పని క్షణాల మీద పూర్తి కావటమూ, అంతలోనే ఆ ఆఫీసరు మళ్లీ అక్కడకు వచ్చి, జరిగిన పని చూసి, "పది సంవత్సరాల నుంచి జరగని పనిని నువ్వు పూర్తిచేశా"వని తనను తెగ మెచ్చుకొని, అక్కడికి అక్కడే ప్రమోషను యివ్వటము, అన్నీ కలలో జరిగినట్లు జరిగిపోయాయి.

- సశేషం

-గత సంచిక తరువాయి




- రమణ ప్రసాద్

# సూరదాస్

ఒక గోపబాలుడు వెంటనే వెళ్ళి యశోదామాతతో "అమ్మా! రాధను కృష్ణసర్పం కాటు వేసిందట. నువ్వు కృష్ణుణ్ణి త్వరగా రాధ చెంతకు పంపాలి. శ్రీకృష్ణుని మించిన మంత్ర వైద్యుడు మన వ్రజ భూమిలోలేడు. మీరు ఆలశ్యం చేస్తే ఆమె ప్రాణాలకే ముప్పు" అని చెప్పాడు. ఆ వార్త విన్న యశోద మందహాసవదనురాలైనదని సూరదాస్ వర్ణిస్తాడు. రాధను కరచిన కృష్ణ సర్పం తన కన్నయ్యే అని యశోద గ్రహించి తనకు తెలియకుండానే కృష్ణయ్య మంత్రశాస్త్రంలో ఇంత ప్రావీణ్యం ఎప్పుడు సంపాదించాడా అని ఆబ్బుర పడుతుంది. ఆడుకుంటున్న శ్రీకృష్ణుణ్ణి పిలిచి "నాయనా! కన్నయ్యా! రాధను కృష్ణ సర్పం కాటువేసిందట పాపం! ఏ అపాయంలో ఉన్నదో! వెళ్ళిరక్షించు"అని శ్రీకృష్ణుని వైపు నవ్వుతూ అంటుంది. యశోదామాత.



హరి గారుడీ తహా తబ్ ఆయె
యహ బానీ వృషభాను సుతానుని
మన మన హరష బఢాయే . . .

శ్రీకృష్ణుడు వెంటనే రాధ ఉన్న స్థలానికి పరిగెత్తుకొంటూ వచ్చాడు. రాధను చూశాడు. కృష్ణుడు వచ్చాడు అన్న వార్త రాధ చెవిన పడింది. రాధ హృదయం ఆనందంతో నిండిపోయింది. ఆనంద పారవశ్యంతో అశ్రుధారలు రాలుతున్నాయి. శరీరం కంపిస్తోంది. ఈ లక్షణాలన్నీ చూసిన సునయనాదేవి భయపడి పోయింది. "కృష్ణా! నా రాధను రక్షించు నేను నీకు ఋణగ్రస్తురాలై ఉంటాను." అని ప్రార్థించింది.

రాధ యదార్థస్థితిని గ్రహించిన శ్యామసుందరుడు లోలోపల ముసిముసి నవ్వులు నవ్వుతూ రాధను సమీపించాడు. మంత్రోచ్ఛారణ చేస్తున్నట్లు పెదవులు కదిపాడు. తన అమృతహస్తంతో రాధ శరీరాన్ని

స్పృశించాడు. అంతే! ఆమె వ్యాధి మాయమైంది. నిద్ర నుండి లేచినట్లు లేచింది. "రాధా! శ్యామసుందరుని దయచేతనే ఈనాడు నువ్వు రక్షించబడ్డావు" అంది సునయనాదేవి. రాధ కృతజ్ఞతతో శ్రీకృష్ణుని చూసింది" అని సూరదాస్ "సూరసాగర్ "లో అపూర్వంగా చిత్రీకరించాడు.

ఆ సంఘటనను తాత్వికులకు ఎలా గోచరిస్తుంది అంటే - చెలికత్తెలు అనే వాసనా ప్రపంచంలో క్రీడిస్తున్న రాధ అనెడి జీవుని మనస్సు వాసుదేవుని వైపు మరలగానే అంతవరకు సాగించిన భోగ జీవన వృత్తికి స్వస్తి చెపుతుంది. భగవానుని పై మనస్సు మరలిన జీవుడు రాధవలె నిష్క్రియత్వం పొంది తదేకంగా పరమాత్మ గురించే చింతిస్తుంటాడు. రాధ అనే జీవిలో కలిగిన అంతరంగిక పరిణామాన్ని గుర్తించలేని ప్రాపంచిక జీవులు భ్రాంతి అనే కృష్ణ సర్పం కాటువేసిందని గోల చేస్తారు. అది వినగానే మనస్సు అనెడి సునయనాదేవి విలపిస్తూ ఆరాటపడుతుంది. అవగాహన కల్గిన బుద్ధి అనే వృద్ధుడు కృష్ణ సందర్శనమే దానికి దివ్య ఔషధమని తెలియ చేస్తాడు. కృష్ణ సందర్శనం కావాలంటే గురువు అనుగ్రహం కావాలి. యశోదయే అట్టి గురుదేవులు. గురుదేవులైన యశోదామాత అనుగ్రహంతో శ్రీకృష్ణుడు అను దేవుడు రాధ గృహమనే జీవ శరీరంలో వ్యక్తం కాగానే జీవ చైతన్యం ఆత్మ చైతన్యంగా మారుతుంది. అట్టి దివ్య పారవశ్య ఆత్మానుభూతిలో అనేక శుభచిహ్నాలు గోచరిస్తాయి. అవియే రాధ శరీరంలో వ్యక్తమైన గగుర్పాటు, శరీర కంపనం, అశ్రు ధారలు. భగవానుని స్పర్శ చేత కలిగిన దివ్యానందమే రాధలో కలిగిన దరహాసం. రాధవెంటనే కళ్ళు తెరుస్తుంది. ఆమెకు కృష్ణుడు కనిపిస్తాడు. ఆత్మానుభూతి పొందిన జ్ఞాని ప్రపంచాన్ని దర్శించగానే అతనికి సమస్తమూ కృష్ణ మయంగా తోస్తుంది. అదియే ఈ సన్నివేశం ద్వారా సూరదాస్ సృష్టించి వెలిబుచ్చిన అద్భుత ఆధ్యాత్మిక అపూర్వ చిత్రీకరణము.

- సశేషం

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL